మొదటి సెమిస్టర్ పాస్ కాలేదని.. బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య 7

రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు

రెప్పపాటులో.. ఘోరం!















మృతులు శివన్నారాయణ, దేవి లలిత,తీగిరెడ్డి శివ, వర్షిత, శాన్వి

పాల ట్యాంకర్ వెనుక దూసుకుపోయిన కారు

20 నిమిషాల్లో గమ్యం.. అంతలోనే విషాదం

- వడిశలేరు వద్ద లారీని ఢీకొన్న కారు
- రెండు కుటుంబాలు ఛిద్రం
- ఐదుగురు మృతి..ఇద్దరికి గాయాలు
- కాకినాడ వెళ్లివస్తుండగా ఘటన
- మృతులది రఘునాథపురం,పిడింగొయ్యి

రాజమహేంద్రవరం/రంగంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):సాయంత్రం వరకూ కాకినాడ బీచ్‌లో సరదాగా గడిపారు.. ఆ కబుర్లు చెప్పుకుంటూ ఎంతో ఆనందంగా ఇంటికి బయలు దేరారు..మరో 20 నిమిషాల్లో ఇంటికి వెళ్లిపోతారు..రెప్పపాటులో ఘోరం జరిగిపోయింది.. అతివేగం తీరని విషాదం నింపింది. బావా బావమరుదుల కుటుంబంలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు.దీంతో తీవ్ర విషాదం నెలకొంది.రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన రేలంగి శివన్నారాయణ, రాజమండ్రి రూరల్ మం డలం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని కవలగొయ్యికు చెందిన తీగిరెడ్డి శివ బావా బామ్మర్దులు.ఎక్కడికెళ్లినా కలిసేవెళతారు.. ఇద్దరూ సరదాగా ఉంటారు. రేలంగి శివన్నారాయణకు కవల పిల్లలు వర్షిత, హర్షిత. వీరికి 13 సంవత్సరాలు. వీరి ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం కోసం గత కొద్దిరోజులుగా కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి వస్తున్నారు. దీనిలో భాగంగానే సోమవారం పీజీఆర్ఎస్ ఉండడంతో ఉదయం 9గంటల ప్రాంతంలో ఎస్‌యూవీ జైలో కారులో రేలంగి శివన్నారాయణ (40),ఆయన సతీమణి రేలంగి దేవి లలిత (34), వారి కవల పిల్లలు వర్షిత(13), హర్షిత (13), ఆయన బావమరిది తీగిరెడ్డి శివ(30) ,ఆయన సతీమణి తీగిరెడ్డి భవాని (26), కుమార్తె తీగిరెడ్డి సాన్వి(4) కలిసి సోమవారం కారులో కాకినాడ వెళ్లారు. కాకినాడలో పని చూసుకొని బీచ్‌కి వెళ్లి సరదాగా గడిపారు.భోజనం అనంతరం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తిరుగు పయనమయ్యారు. 20 నిమిషాల్లో ఇంటికి చేరిపోతారనగా రెండు కుటుంబాలు రెప్పపాటులో ఛిద్రమైపోయాయి. వీరిలో ఐదుగురు మృతిచెందగా హర్షిత, భవాని ఒక ప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కారును కిరాయికి తెచ్చి..

రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ తదితర వ్యాపారాలు చేస్తున్న శివన్నారాయణ ఓన్ డ్రైవింగ్ విధానంలో కారును స్నేహితుడి నుంచి ఎప్పటి మాదిరిగానే కిరాయికి తీసుకున్నాడు. కారును బావమరిది శివ నడుపుతున్నాడు. ఏడీబీ రోడ్డులోని వడిశలేరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రంగం పేటలోని ఓ డైయిరీ నుంచి పాల లోడుతో వస్తున్న ట్యాంకరు రోడ్డుపై నిలిపి ఉంది. అక్కడ రోడ్డు మరమ్మతులు చేస్తుండడంతో డైవర్షన్ బారికేడ్లు పెట్టారు. ఎడమవైపున లారీ ఆగి ఉంది. అక్కడికి వచ్చాక కారును కుడి వైపునకు మళ్లించాల్సి ఉంది. అయితే కారు వేగంగా వస్తుండడంతో మలుపు తిప్పే సమయంలో కుడి వైపునకు తిరగకుండా నేరుగా ఎదురుగా ఉన్న పాల ట్యాంకరులోకి దూసుకుపోయింది. దీంతో ముం దు సీట్లో కూర్చున్న శివన్నారాయణ, శివ, మధ్య సీట్లోని వర్షిత, లలిత, శాన్వి అక్కడికక్కడే మృతిచెందారు.వెనుక సింగిల్ సీట్లలో కూర్చున్న భవానీ, హర్షిత తీవ్రంగా గాయపడగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందున్నారు. ఏడీబీ రోడ్డులో సుమారు ఆరేళ్లగా మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. దీంతో ఎక్కడపడితే అక్కడ బారికేడ్లు, డైవర్షన్లు ఉండడంతో అయోమయం ఏర్పడి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఆస్పత్రి వద్దకు మంత్రి కందుల దుర్గేష్ చేరుకొని బాధిత కుటుం బాలను ఓదార్చారు. రెండు కుటుంబాల్లో విషాదం కలచివేస్తోందన్నారు.మృతుల్లో కొందరికి జనసేన సభ్యత్వం ఉందని చెబుతున్నారని,ఆ మేరకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రయత్నిస్తామన్నారు.బాధితులను రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి పరామర్శించి ధైర్యం చెప్పారు.అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ,డీఎస్పీలు దివ్య, రమేష్ బాబు, సీఐ అప్పారావు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.పాలవ్యాన్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.ప్రమాదంపై రంగంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కవలలను విడదీసిన ప్రమాదం

శివన్నారాయణ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. అబ్బాయి ఇంటి దగ్గరే ఉండిపోవడంతో ప్రాణాలు దక్కాయి. ఇద్దరు కుమార్తెలు హర్షిత,వర్షిత కవలలు. పుట్టుక దగ్గర నుంచీ కలిసే ఉన్నారు. కలిసి చదువుకుంటున్నారు. ఇప్పు డు వర్షిత.. హర్షితను 13 ఏళ్లకే వదిలి వెళ్లిపోయిందం టూ బంధువులు రోదిస్తున్న తీరు కలచివేసింది.



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి దుర్గేష్



పాలవ్యాన్ లారీలో సగానికి దూసుకుపోయిన కారు



కారులో నొక్కుకుపోవడంతో ముగ్గురు సీట్లలోనే మృతి



రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో మృతుల కుటుంబీకులు రోదన

ప్రమాదానికి.. కారణమిదే..

వడిశలేరు సాయిబాబా గుడి వద్ద ఏడీబీ రోడ్డుపై కల్వర్టు నిర్మిస్తున్నారు. ఆ రోడ్డులో కార్లు రాకుండా పెట్రోలు బంక్ దగ్గర డైవర్షన్ పెట్టారు.అక్కడే ట్యాంకర్ ఆపి డ్రైవర్ మంచినీళ్ళు తెచ్చుకోవడానికి పెట్రోలు బంక్‌లోకి వెళ్లాడు. కారు అక్కడే కుడివైపునకు తిరిగి వెళ్లవలసి ఉండగా వేగంగా వచ్చిన కారు ట్యాంకర్‌ని బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.



28 ఇసుక ర్యాంపులు నిలిపివేత

అక్టోబరు 15 వరకూ బంద్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 28 ఇసుక ర్యాంపులు నిలిచిపోయాయి. జిల్లాలో 15 ఓపెన్ రీచ్‌లు, 10 సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు, 3 పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు ఆగినట్టు జిల్లా మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి సోమవారం ప్రకటించారు. జూన్ 1 నుంచే అమల్లోకి రాగా అక్టోబరు 15వ తేదీ వరకూ అమల్లో ఉంటుందని తెలిపారు. 18 డీసిల్టేషన్ పాయింట్లలో మాత్రం ఇసుక తవ్వకాలు జరుగుతాయి. జిల్లాలో 29 స్టాక్ పాయింట్లలో అధికారులు నిర్ణయించిన ధర ప్రకారం ఇసుక విధానాన్ని అమలు చేయనున్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఛైర్మన్(కలెక్టర్) నిర్ణయించిన ధరల మేరకు స్టాక్ పాయింట్ల వద్ద కాంట్రాక్టు ఏజెన్సీలు ఇసుక విక్రయాలు చేయాలనే నిబంధన పెట్టారు. జిల్లాలో ఆగిపోయిన ర్యాంపుల వివరాలు ఇలా ఉన్నాయి. కొవ్వూరు మండలం అరికిరేవుల, చిడిపి, తాళ్లపూడి మండలం ప్రక్కిలంక , నిడదవోలు మండలం పురుషోత్తపల్లి సెమీ మెకనైజ్డ్ రీచ్‌లను నిలిపివేశారు.సీతానగరం మండలం ములకల్లంక, మునికూడలి-1,2 పట్టాభూములు నిలిపివేశారు. మాన్యువల్‌రీచ్‌లు కొవ్వూరులోని చిడిపి, కుమారదేవంలో మూడు ర్యాంపులు,నిడదవోలులోని జీడిగుంట, పందలపర్రు,పెండ్యాల, పెరవలి మండలం కాకరపర్రు,తీపర్రు -2,3 సీతానగరం మండలం ములకల్లంక- కాటవరం,వంగలపూడి1,2, తాళ్లపూడిలోని వేగేశ్వరపురం, కడియంలోని వేమగిరి-కడియపులంక రీచ్‌లను అధికారులు నిలిపివేయాలని ఆదేశించారు. వర్షాకాలమైనప్పటికీ 18 డీసిల్టేషన్ ర్యాంపులలో ఇసుక తీతకు అనుమతిచ్చారు. కొవ్వూరు మండలం అరికిరేవుల-1,2, ఔరంగాబాద్ -1,2,దొండగుంట-1,2,కొవ్వూరు,ఎరినమ్మ, వాడపల్లి-1,2,రాజమండ్రి రూరల్ పరిధి ధవళేశ్వరంలో రెండురీచ్‌లు, కాతేరు, రాజమండ్రి సిటీ పరిధి కోటిలింగాల రీచ్,తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం, ప్రక్కిలంక-1, తాడిపూడి -1, మరొ కటి, తాళ్లపూడి-1 రీచ్‌లలో డీసిల్టేషన్ జరుగుతుంది.వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా 29 స్టాక్ పాయింట్లలో నిల్వలు చేస్తున్నారు.అక్కడే ఇసుక విక్ర యిస్తారు.



స్విఫ్ట్ కారు.. వెనుక సీటులో ఉన్న దూడలు

స్విఫ్ట్ కారులో దూడల తరలింపు

కొవ్వూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : గిత్త దూడలను అక్రమంగా స్విఫ్ట్ కారులో తరలిస్తుండగా ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు కొవ్వూరు పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఏజస్ ఆదివారం రాత్రి తుని వద్ద 4 గిత్త దూడలను కొనుగోలు చేసి స్విఫ్ట్ కారులో వెనుక సీటు తొలగించి అక్రమంగా హైదరాబాద్ తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది.సీఐ విశ్వం సిబ్బందితో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు గిత్త దూడలు తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కొవ్వూరు పోలీసులు సోమవారం ఏజస్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు.కారును సీజ్ చేసినట్టు తెలిపారు.గిత్త దూడలను సంరక్షణ నిమిత్తం దగ్గరలోని గోశాలకు తరలిస్తున్నట్టు తెలిపారు.

చివరిలో వచ్చారు.. వైస్ చైర్మన్ అయ్యారు..



వైస్‌చైర్మన్ వజీరుద్దీన్‌ని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్, చైర్మన్ ఆదినారాయణ తదితరులు

- మంత్రి ఇలాఖాలో పాలిట్రిక్స్
- నిన్నటి వరకూ ఇద్దరి మధ్య పోటీ
- సోమవారం తెరపైకి కొత్తముఖం
- వైస్ చైర్మన్‌గా వజీరుద్దీన్
- రేసులో లేని రతీదేవి..కారింకి
- ఎన్నికకు వైసీపీ దూరం
- టీడీపీ కౌన్సిలర్ కారింకి డుమ్మా

నిడదవోలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మునిసిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక సోమవారం అత్యంత నాటకీయ పరిణామాల మధ్య జనసేన కైవసం చేసుకుంది. మరో పక్క వైస్ ఛైర్మన్ ఎన్నికకు వైసీపీ కౌన్సిలర్లు పూర్తిగా దూరంగా ఉన్నారు. వీరికి తోడు టీడీపీ నుంచి గెలుపొందిన ఒకే ఒక్క కౌన్సిలర్ కూడా ఎన్నికకు దూరంగా ఉన్నారు. నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్ హాలులో సోమవారం మునిసిపల్ వైస్‌ఛైర్మన్ ఎన్నిక నిర్వహించారు. పరిశీలకుడిగా జేసీ ఎస్.చినరాముడు,ఎన్నికల అధికారిగా ఏ.దుర్గేష్ వ్యవహరించారు. నిడదవోలు పుర పాలక సంఘానికి సంబంధించి 28 మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే, మంత్రి దుర్గేష్ ఎక్స్‌అఫీషియో నెంబర్‌గా నమోదై ఉండడంతో మొత్తం 29 మందికి ఓటు హక్కు ఉంది. ఇందులో వైసీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు ఎన్నికకు గైర్హాజరయ్యారు. టీడీపీకి చెందిన ఒకే ఒక్క కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు కూడా హాజరు కాలేదు. దీంతో 14 మంది జనసేన కౌన్సిలర్లు,ఎక్స్ అఫీషియోగా ఉన్న మంత్రి దుర్గేష్‌కు తోడుగా మరో వైసీపీ కౌన్సిలర్ షేక్ వజీరుద్దీన్ చివరి నిమిషంలో మంత్రి సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు. చివరి నిమిషంలో జనసేనలో చేరిన షేక్ వజీరుద్దీన్‌ను వైస్ చైర్మన్ అభ్యర్థిగా జనసేన కౌన్సిలర్ గంగుల వెంకటలక్ష్మి ప్రతిపాదించగా మరో జనసేన కౌన్సిలర్ మద్దిపాటి నాగశ్రీ బలపరిచారు. పోరం సరిపోవడంతో షేక్ వజీరుద్దీన్‌ను మునిసిపల్ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఏ.దుర్గేష్ ప్రకటించారు. వైస్ ఛైర్మన్ అభ్యర్థిగా సోమవారం ఉదయం వరకు జనసేన పార్టీకి చెందిన కౌన్సిలర్ పువ్వుల రతీదేవి, టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావుల మధ్య నువ్వా నేనా అన్నరీతిన పోటీ నెలకొంది. ఇరువర్గాల మధ్య విభేదాలు తలెత్తడంతో టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు ఎన్నికకు దూరంగా ఉన్నారు. అయితే చివరి నిమిషంలో వైసీపీ కౌన్సిలర్ వజీరుద్దీన్‌ను జనసేన పార్టీలోకి ఆహ్వానించి వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో భవిష్యత్‌లో జరిగే ఏ ఎన్నికల్లో అయినా కూటమి విజయంలో జనసేన కీలక పాత్ర పోషిస్తుందన్నారు.జూన్ 4వ తేదీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి కానుకగా నిడదవోలు మునిసిపల్ విజయాన్ని అందిస్తున్నామన్నారు.

దండకుంటలో 2 ఇసుక డ్రెడ్జర్లు సీజ్

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో దింపిన 2 డ్రెడ్జర్లను సీజ్ చేసినట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశాల మేరకు సోమవారం కొవ్వూరులోని ఇసుక ర్యాంపులను టాస్క్‌ఫోర్సు అధికారులతో కలిసి ఆర్డీవో రాణిసుస్మిత తనిఖీ చేశారు.ఆరికిరేవుల రోడ్‌లోని దండకుంట ఇసుక ర్యాంపులో నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో దింపిన 2 డ్రెడ్జర్లు ఎవరివని ప్రశ్నించారు. మావి కాదని చెప్పడంతో వెంటనే డ్రెడ్జర్లను సీజ్ చేసి మైన్స్ అధికారులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు.ఆమె వెంట తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏజీ ఆర్‌బి ఏఈ జి.మణికంఠరాజు, టాస్క్‌ఫోర్సు అధికారులు ఉన్నారు.

దండకుంట ర్యాంపులో ఇసుక డ్రెడ్జర్లు సీజ్ చేసి వెళుతున్న ఆర్‌డీవో





ఆరోగ్యాంధ్ర

ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రతి రోజూ ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు.. జిల్లా అధికారులు హాజరై యోగాసనాలు వేస్తున్నారు.. సోమవారం జిల్లా వ్యవసాయాధికారి తదితరులు ఇలా యోగాసనాలు వేశారు.. ఆరోగ్యానికి యోగా మంచిదని అన్నారు..



ఏపవై కార్డు ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకుంటున్న దివ్యాంగురాలు

పీజీఆర్ఎస్‌కు 279 అర్జీలు

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలతో పాటు, మీ సేవ పోర్టల్ ,1100 టోల్‌ఫ్రీల ద్వారా వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి . ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు అనుసరించి పరిష్కారం చూపాలన్నారు. అనపర్తి మండలం పాలమూరు గ్రామానికి చెందిన నూకారపు సత్యవతి సామాజిక భద్రత పెన్షన్ కింద రూ.6 వేలు పెంపు, అంత్యోదయ కార్డుకు అర్జీపెట్టుకున్నారు.రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం, కడియం పంచాయతీలకు చెందిన జి.అనంతలక్ష్మి, వి.దేవి, సి.నాగమణి, ఐ.లక్ష్మి, చాపల త్రివేణి, షేక్ బేగం ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నారు. తాళ్ళపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన కె.అనిల్ కుమార్ గ్రామంలోని ప్రధానమార్గాల్లో ఆక్రమిత నిర్మాణాలు తొలగించాలన్నారు.పీజీఆర్ఎస్‌లో 279 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి, ముఖ్యప్రణాళిక అధికారి జేడీఎల్.అప్పలకొండ,ఎస్డీసీలు ఎంఆర్ఆర్.ప్రేమ్ కుమార్, టి.భాగ్యలక్ష్మి, డీఎల్‌డీవోలు పి.వీణాదేవి, ఏస్లీవా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ళ స్థలాలకు సీపీఐ ధర్నా

పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కలెక్టర్ ప్రశాంతిని కలిసి ఇళ్ళ స్థలాలకు 1200 మంది సంతకాలతో కూడిన అర్జీలను అందించారు. అనంతరం మధు మాట్లాడుతూ అర్హులందరికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలన్నారు. దళితుల దారిని మూసివేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. రంగంపేట మండలం ఈలకొలను గ్రామపరిధిలోని అచ్యుతాపురం కొత్తపేట కాలనీ దళితులు సోమవారం ధర్నా చేశారు. కొత్తపేట కాలనీకి చెందిన వంద దళిత కుటుంబాలు మార్గంగా వినియోగించుకుంటున్న పుంత రోడ్డును సరిహద్దు రైతు మూసివేశారని..న్యాయం చేయాలని రాజబాబు, బాధిత దళితులు కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రవి కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, నగర కార్యవర్గ సభ్యులు పి.లావణ్య, టి.నాగేశ్వరరావు, పి.త్రిమూర్తులు , కడితి సతీష్, శ్రీకాంత్, డొక్కులూరి సంగీత, రెడ్డి దుర్గాదేవి, మడికి సత్యం పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 25 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ(పరిపాలన), ఏవీ సుబ్బరాజు(శాంతి భద్రతలు) ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యపై ఆరా తీశారు. చట్ట పరిధిలో తగు చర్యలు త్వరితగతిన తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 25 అర్జీలు స్వీకరించారు.





పచ్చని చిలుకలు తోడుంటే...

ఆ ఇల్లు పక్షుల కిలకిలారావాలతో ప్రతిధ్వనిస్తుంది. మండు వేసవి అయినా సరే పక్షులకు చల్లటి వాతావరణం కల్పించేందుకు ఆ కుటుంబంలోని సభ్యులందరూ వంతులవారీగా సమయం నిర్దేశించుకుని నిత్యం శ్రమిస్తారు. కాకినాడ జిల్లా సామర్లకోట ఇస్మాయిల్ నగర్‌కు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ అడబాల శ్రీనివాస్ ఇంట రెండున్నర దశాబ్దాలుగా వివిధ జాతులకు చెందిన 90 పక్షులు (లవ్ బర్డ్స్ చిలుకలు) పంజరాల్లో ఉంటున్నాయి. వాటికి ఆహారం, నీరు వంటి సదుపాయాలను కల్పించడంతో పాటు చల్లదనం కోసం పంజరానికి నలువైపులా గోనెబరకాలు కట్టారు. వేసవిలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నుంచి కాపాడేందుకు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు శ్రమించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఈ చిలుకలను చూసి ఆనందపడుతున్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)





నేరేడు పండు... పోషకాలు మెండు

సామర్లకోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తీపి, పులుపు సమ్మేళనమే నేరేడు పండు. మే నెలాఖరు నుంచి జూన్ చివరి వరకు నేరేడు పండ్లు సీజనల్‌గా లభిస్తాయి. చూసేందుకు నల్ల ద్రాక్షపళ్ల వలే కనిపించే వీటిలో పలు పోషకాలు మన శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతాయి. ఈ పండ్లు తింటే జీర్ణ వ్యవస్థ చక్కగా పనిచేస్తుంది. వీటిని రసం చేసుకుని తాగితే కాలేయ సంబంధిత వ్యాధులు తగ్గిపోతాయి. క్యాలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి హెల్దీ స్నాక్స్‌గా తినొచ్చు. శరీర బరువు తగ్గించుకునేందుకు మంచి ఆహారంగా పనిచేస్తాయి. ఆస్తమా, విపరీతమైన దగ్గును నయం చేయడంలోనూ ఉపయోగపడతాయి. నేరేడు పండ్లలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌తో పాటు నీరు కూడా ఎక్కువే ఉంటుంది. వీటిని తింటే దాహం తీరుతుంది. శరీరం చల్లబడుతుంది. కాకినాడ జిల్లా సామర్లకోట, పెద్దాపురం పట్టణాలతో పాటు పలు ప్రాంతాల్లో సైకిళ్లకు గంపలు కట్టుకుని నేరేడు పండ్లు విక్రయిస్తుండగా పలువురు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాదు నేటి తరానికి వాటి రుచి చూపించి తినిపిస్తున్నారు.



పేదవారి కర్జూరం ఈత పళ్లు

గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో లభించే ఈత పళ్లకు పేదోళ్ల ఖర్జూరంగా పేరు ఉంది. వేసవిలో మాత్రమే లభించే వీటిని తినడం వల్ల కాల్షియం ఎక్కువగా అందుతుందని వైద్యులు చెప్తారు. ఎముకలు బలపడతాయని, ఆలోచనా శక్తి బాగా పెరుగుతుందన్న ప్రచారమూ ఉంది. ప్రతిరోజూ ఈతపళ్లు తినడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. క్యాన్సర్ వ్యాధి రాకుండా నిరోధిస్తుంది. ఐరన్ సమృద్ధిగా ఉండి రక్తం వృద్ధి చెందుతుంది.

ఎన్నేళ్లో వేచి ఉదయం రానే వచ్చింది. చాలా సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న వారంతా మరలా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఎలా ఉన్నావు... ఏమి చేస్తున్నావు... అంటూ కుశలప్రశ్నలు వేసుకుని రోజంతా సందడిగా గడిపారు.

ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. తరగతి గదుల్లో చదువుకున్న క్షణాలను, అలనాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. తమ ఉన్నతికి కారణమైన గురువర్యులకు పాద పూజ చేసి ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. గురువులతో కలిసి భోజనాలు చేశారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గురువులతో 1984-89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల గ్రూప్ ఫొటో

ఎన్నేళ్లో వేచిన ఉదయం

అమలాపురం, పటవలల్లో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అమలాపురం టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గండు వీధిలోని మున్సిపల్ హైస్కూలు 1984-89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక సోమవారం జరిగింది. ఈ హైస్కూలు మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందడంతో వారంతా పట్టణంలోని ఏబీసీడీ ఫుడ్ కోర్టులో కలుసుకున్నారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో స్థిరపడ్డ సుమారు 60 మంది విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అలనాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు ఎస్ఎస్ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి, బందా ఆర్.కామేశ్వరరావు, ఎల్ఎంఎస్, సావిత్రి మేడం, ఉమాదేవి, గంగాధర్, కేతా సత్యనారాయణ, భాస్కరాచార్యులు, యర్రమిల్లి పాండు రంగారావులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గురువులకు పాదపూజ చేసి దుశ్శాలువాలు కప్పి పుష్పమాలలతో సత్కరించారు. కమల, యేడిద శ్రీను, నంద్యాల నాయుడు, నూకల శివ, ఉప్పలగుప్తం శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మణకుమార్ నాయకత్వం వహించి నాటి విద్యార్థులను ఒక్కచోటకు చేర్చారు. అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల జిల్లాప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 1991-92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో సోమవారం గెట్ టుగెదర్ నిర్వహించారు. ప్రేమ, ఆప్యాయతలతో పలకరించుకుంటూ ఉప్పొంగిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. వారితో కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే కలిసి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని తీర్మానించారు.



కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల జడ్పీ హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వసంతవాడలో కేంద్ర నోడల్ బృందం పర్యటన

- జలజీవన్ మిషన్ పనుల పరిశీలన
- పథకం అమలుపై గ్రామస్థులతో ఆరా



జలజీవన్ మిషన్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర నోడల్ బృందం

ఆత్రేయపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రం సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జలజీవన్ మిషన్ పథకం పనులను కేంద్ర నోడల్ బృందం పరిశీలించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలో ఉన్న ఆవాస ప్రాంతాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఆత్రేయపురం మండలం వసంతవాడ గ్రామంలో సోమవారం కేంద్ర నోడల్ అధికారి పూర్ణచంద్రకిషన్, టెక్నికల్ ఆఫీసర్, సాంకేతిక సలహాదారు బి.విశ్వదీప్‌దాస్‌తో పాటు బృందం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పథకంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శివారు ప్రాంత ప్రజల తాగునీటి ఇక్కట్లను పరిష్కరించేందుకు ఈ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందుతున్న విధానంపై ఆరాతీశారు. అనంతరం వసంతవాడ పంచాయతీలో సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. జలజీవన్ మిషన్ పథకంలో తాగు నీరు అందుతున్న విధానంపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ బి.కృష్ణారెడ్డి, పర్యవేక్షకురాలు భారతి, తూర్పుగోదావరి జిల్లా సూపరింటెండెంట్ వెంకటగిరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్.రవికుమార్, డి.శ్రీనివాస్, శ్రీనివాసబాబు, పద్మనాభం, ఏఈఈ శ్రీధర్, ఎంపీడీవో వెంకటరామన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్, డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి నేటి నుంచి ఇంటర్వ్యూలు

ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ వేణుగోపాలవర్మ

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26కు గాను ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 3నుంచి 10వరకు షెడ్యూల్ ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలని కోరారు. జూన్ 3న ఉదయం 8గంటల నుంచి మెరిట్ 1నుంచి 80, జీపీఏ 10నుంచి 7.5వరకు. మధ్యాహ్నం 1గంట నుంచి మెరిట్ 81నుంచి 159, జీపీఏ 7.4 నుంచి 6.8 వరకు. 4న ఉదయం మెరిట్ 160 నుంచి 242, జీపీఏ 6.7నుంచి 6.2వరకు, మధ్యాహ్నం మెరిట్ 243 నుంచి 325, జీపీఏ 6.1 నుంచి 5.7 వరకు.



కాకినాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల

5న ఉదయం మెరిట్ 326 నుంచి 407, జీపీఏ 5.6 నుంచి 5.2 వరకు, మధ్యాహ్నం మెరిట్ 408 నుంచి 484, జీపీఏ 5.1 నుంచి 4.7కి వరకు. 6న ఉదయం మెరిట్ 484 నుంచి 557, జీపీఏ 4.6 నుంచి 4.2 వరకు, మధ్యాహ్నం మెరిట్ 558 నుంచి 634, జీపీఏ 4.1 నుంచి 3.0 వరకు. షెడ్యూల్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం జనరల్ కేటగిరీలో జూన్ 9న ఉదయం మెరిట్ 1 నుంచి 159, జీపీఏ 10 నుంచి 6.8 వరకు. మధ్యాహ్నం మెరిట్ 160 నుంచి 325, జీపీఏ 6.7 నుంచి 5.7 వరకు. 10న ఉదయం నుంచి మెరిట్ 326 నుంచి 484, జీపీఏ 5.6 నుంచి 4.7 వరకు, మధ్యాహ్నం మెరిట్ 485 నుంచి 634, జీపీఏ 4.6నుంచి 3.0 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అలాగే సీట్లు రాని, కౌన్సెలింగ్‌కు హాజరు కాని అభ్యర్థులు కూడా 9,10 తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ చాలెంజ్‌లో ఫైనల్‌కు చేరిన బీవీసీ విద్యార్థులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించి నీటిని శుద్ధిచేయడం, వినియోగించడంపై ప్రాజెక్టు రూపకల్పన



ఫైనల్ పోటీలకు ఎంపికైన భట్లపాలెం బీవీసీ కళాశాల విద్యార్థులు

అమలాపురం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మలేషియా దేశంలోని కౌలాలంపూర్ యూకేఎం యూనివర్శిటీలో నిర్వహించే ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ చాలెంజ్ ఫైనల్ రౌండ్ పోటీలకు భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఫ్రెష్ వాటర్ ఫ్యూచర్స్ ప్రాజెక్టు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు తెలిపారు. క్లీన్ వాటర్ అండ్ శానిటేషన్ విభాగంలో అంతర్జాతీయంగా ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ పోటీలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు రెండు రౌండ్లు పోటీలు జరగ్గా దేశ వ్యాప్తంగా వెయ్యికి పైగా కళాశాలల నుంచి విద్యార్థులు ప్రాజెక్టులను పోటీల్లో ఉంచారు. రెండు రౌండ్లలోను బీవీసీ కళాశాల విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించి నీటిని శుద్ధిచేయడం, వినియోగించడంపై రూపొందించిన ఫ్రెష్ వాటర్ ఫ్యూచర్ ప్రాజెక్టు ఇన్నోవేషన్ చాలెంజ్ ఫైనల్ రౌండ్‌కు చేరుకుంది. కళాశాలకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మిషన్ లెర్నింగ్ విభాగం విద్యార్థులు వి.మణిశ్రీ, కె.లీల, ఎ.పల్లవి, సి.అశ్విథ ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఆగస్టు 22, 23 తేదీల్లో కౌలాలంపూర్‌లోని యూకేఎం యూనివర్శిటీలో ప్రాజెక్టు ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. మలేషియాలో జరిగే పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు కళాశాల యాజమాన్యం నిర్ణయించింది. ప్రాజెక్టు పైలెట్‌గా యేడిది శర్మ వ్యవహరించగా కోఆర్డినేటర్‌గా బీవీ సతీష్, మెంటర్‌లుగా వంశీరామ్, భవానీ, అంబాసిడర్‌గా విజయ్‌సూర్య వ్యవహరించారు. ఫైనల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను బీవీసీ కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుమల ప్రతిభ



ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులతో చైర్మన్ నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ -2025 ఫలితాల్లో రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంక్‌లు సాధించి సత్తా చాటారు. సోమవారం విడుదల చేసిన ఈ ఫలితాల్లో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి కె.ప్రణీత్ ఆలిండియా స్థాయిలో 2వ ర్యాంక్ సాధించాడు. జాతీయ స్థాయిలో కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ 8వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా తిరుమల విద్యాసంస్థల్లో జరిగిన విలేకరుల సమావేశంలో చైర్మన్ నున్న తిరుమలరావు మాట్లాడారు. 2, 8 ర్యాంక్‌లతో పాటు డి.హర్ష వర్ధిత్ 12వ ర్యాంక్, ఎం సుమంత్ దొర 38వ ర్యాంక్, మజ్జి పురుషోత్తమ రావు 39వ ర్యాంక్, కె.అభినవ్ 42 ర్యాంక్, జి సుజోష్ రాజు 43వ ర్యాంక్, జి.అఖిల్ సాయి 45వ ర్యాంక్, తుమాటి పూజిత అఖిల్ రాజ్ కుమార్ 85వ ర్యాంక్, ఆర్.చరణ్ తేజ 86వ ర్యాంక్, కప్పల వెంకట రామవినీష్ 127వ ర్యాంక్, పాతపాటి వెంకట వివేక్ వర్మ 132వ ర్యాంక్, మువ్వల లిఖిత 137వ ర్యాంక్ సాధించారని తెలిపారు. ప్రధాన ర్యాంక్‌లతో పాటు 165, 174, 193, 195, 226, 231, 238, 243, 245, 246, 270, 272, 275, 276 ర్యాంక్‌లు సాధించారన్నారు. వెయ్యి లోపు 69 మంది, 3వేల లోపు 201 మంది, ఐదువేల లోపు 333 మంది, పదివేల లోపు 456 మంది ర్యాంక్‌లు సాధించారన్నారు. ఈ ఏడాది 260 మందికి పైబడి ఐఐటీ సీట్లు సాధిస్తారని చెప్పారు. ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ ఐ.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరిలతో కలిసి తిరుమలరావు అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా!



జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది. తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీలో ఇచ్చిన అత్యుత్తమ బోధన వల్లే ఈ ర్యాంక్ సాధించడం సాధ్యమైంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, తిరుమల విద్యాసంస్థల ఫ్యాకల్టీ బోధనతో ర్యాంక్ సాధ్యమైంది. నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతాను.

-ప్రణీత్, 2వ ర్యాంకర్.

ఐఐటీలో సీటు కోసం చదివాను



ఆలిండియా స్థాయిలో 8వ ర్యాంక్ సాధించడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఐఐటీలో సీటు సాధించాలనే పట్టుదలతో చదివాను. టైం టేబుల్‌కు అనుగుణంగా చైర్మన్ తిరుమలరావు ప్రోద్బలంతో ర్యాంక్ సాధ్యమైంది.

-కేవై సాత్విక్, 8వ ర్యాంకర్.

'ఆదిత్య' విద్యార్థుల హవా

కాకినాడ రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కాకినాడ ఆదిత్య విద్యార్థుల హవా కొనసాగింది. ఎం. మీసాల జయచంద్ర అఖిలభారత ఓపెన్ కేటగిరీలో 169వ ర్యాంకుతో పాటు పి. ఆదిత్య అభిషేక్ 257, జి.శ్రీరామ శశాంక్ 281, వై.శుభ శ్రీవల్లీ ఆత్రేయి 296వ ర్యాంకు, టి.సాత్విక్ 849, సీహెచ్ సాయి వర్షిత్ 893వ ర్యాంకు, ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 300లోపు నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించినట్టు ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్ రెడ్డి తెలిపారు. అలాగే వివిధ కేటగిరీల్లో 16, 24, 27, 41, 65, 128, 256, 281, 296, 372, 381, 399, 406, 465, 495 ర్యాంకులు పొందారన్నారు. అఖిల భారత స్థాయిలో అన్ని కేటగిరీల నుంచి 100 లోపు ఐదుగురు, 500లోపు 15 మంది, 1000 లోపు 25 మంది, 3000లోపు 62, 5000లోపు 82 మంది ఆదిత్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు సుగుణ, శృతి, లక్ష్మీకుమార్, ప్రిన్సిపాల్ మొయినా అభినందించారు.



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఆదిత్య కార్యదర్శి కృష్ణదీపక్ రెడ్డి

డేవిడ్ జాన్సన్‌కు 1353వ ర్యాంక్



తుని రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఎస్సీ కేటగిరి విభాగంలో దేవి డేవిడ్ జాన్సన్ ఆలిండియా 1353వ ర్యాంక్ సాధించి సత్తా చాటినట్టు శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ కోసం ఇస్తున్న స్పెషల్ కోచింగ్ ద్వారా ఈ విద్యార్థి ఈ ర్యాంక్ కైవసం చేసుకున్నట్టు తెలిపారు. విద్యార్థిని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కేంద్ర పరిశోధన ప్రాజెక్టుకు ఎంపికలు





అమలాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి కేంద్ర పరిశోధనా ప్రాజెక్టుకు ఎంపిక జరిగింది. కోనసీమ వైభవం-సమకాలిన అన్వయం అంశంపై భారత జ్ఞాన పరంపర విభాగం ఆధ్వర్యంలో అధ్యయనం జరిగింది. ఈ ప్రాజెక్టు సహ పరిశోధకులుగా అయ్యగారి నాగేశ్వరరావు, శ్రీపాద రామకృష్ణ పర్యవేక్షణలో విద్యార్థులు ఆరు నెలల పాటు అధ్యయనం నిర్వహించారు. కోనసీమ జీవనశైలిలో ప్రతిబింబించే మానవీయత నైపుణ్యాలు, ధార్మికతలు, ఆధునిక సమాజంలో కూడా ఎలా ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయో ఈ పరిశోధనలో విశ్లేషించనున్నారు. ఈ అధ్యయన ఫలితాలను భారత జ్ఞాన పరంపర విభాగం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించనున్నారు. ప్రాజెక్టుకు ఎంపికైన వారిని బీవీసీ అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణ సతీష్, మేనేజ్‌మెంట్ సభ్యుడు బోనం కనకదుర్గ, ప్రిన్సిపాల్ మహేశ్వర్ అభినందించారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



పెద్దాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మఖ నక్షత్రం సందర్భంగా కాకినాడ జిల్లా పెద్దాపురంలో మరిడమ్మ తల్లికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భాలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దేవస్థానం సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది రమణ, అసాదులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ.. ఏది సామీ!

ఏం తినాలి.. ఎట్లా బతకాలి

- విలీన మండలాల్లో 2నెలలుగా ఉపాధి హామీ శ్రామికులకు అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులతో గగ్గోలు
- పనుల కోసం తెలంగాణ వైపు అడుగులు


చలెంపాలెంలో ఉపాధి పనులు చేస్తున్న గిరిజనులు

ఎటపాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని నాలుగు విలీన మండలాల్లో 28,489 మంది ఉపాధి జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. ప్రస్తుతం 52,135 శ్రామికులు పనులు చేస్తున్నారు. ఉపాధి పనుల్లో బాగంగా నీటి కుంటలు, ఇంకుడుగుంతలు, భూమి చదును, సరిహద్దు కందకాలు, పశువుల నీటి తొట్టెలు, పంట కాల్వలు తదితర పనులు నిర్వహిస్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పనులు చేసిన 15 రోజుల్లో శ్రామికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ పనులు చేసి రెండు నెలలు పూర్తవుతున్నా ఇప్పటివరకు వేతనాలు చెల్లించని దుస్థితి ఉంది.

ఉపాధిహామీ శ్రామికులు గత రెండు నెలలుగా పనులు చేసినా ఇంత వరకు వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని వారికి పనులకు చెల్లింపులు లేకపోవడంతో పూట గడవని పరిస్థితి ఏర్పడింది. నెలలుగా ఉపాధి పనులు చేస్తున్నప్పటికీ వేతన బిల్లులు రావపోవడంతో ఏం తినాలి... ఎట్లా బతకాలి అంటూ వాపోతున్నారు.

రూ.9 కోట్ల బకాయిలు..

గత 2 నెలలుగా పనులు చేసిన ఉపాధిహామీ శ్రామికులకు వేతనాలు జమ అవడంలేదు. అయితే మార్చి వరకు శ్రామికులకు వేతనాలు ఖాతాల్లో జమ అయ్యాయి. ఏప్రిల్, మేనెలల్లో చేసిన పనులకు వేతన బకాయిలు జమకావాల్సి ఉంది. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు బకాయిలు రావాల్సి ఉంది. 2 నెలలుగా వేతనాలు విడుదల కాకపోవడంతో శ్రామికులు ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. విలీన మండలాల్లో రెండు నెలల పనులకు గాను ఉపాధి శ్రామికులకు మొత్తం సుమారు రూ.9.కోట్ల వరకు బకాయి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

వేసవి అలవెన్స్ నిలిపివేత..

వేసవిలో ఉపాధి పనులు చేయడం కష్టంగా ఉంటుందని భావించిన ప్రభుత్వాలు గతంలో ఉపాధి పనుల సమయాల్లో ఫిబ్రవరి నెలలో 20శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30శాతం, జూన్‌లో 20 శాతం వరకు పనుల పరిమాణం తగ్గించి 100 శాతం పనికి వేతనం అందించేవారు. వేసవిలో నెల గట్టిగా ఉండడంతో పని తక్కువ జరిగినా వేసవి అలవెన్స్‌తో కలిపి వేతనం అందించేవారు. అయితే ఈ ఏడాది శ్రామికులకు వేసవిలో ఇవ్వాల్సిన అలవెన్స్‌ను నిలిపివేశారు. దాంతో ఈ ఏడాది వేతనాలు తగ్గే అవకాశంఉందని గగ్గోలు పెడుతున్నారు.

పనుల కోసం వలసలు..

ఈ ఏడాది వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా ఉండడం, ఉపాధి పనుల వేతనాలు సకాలంలో రాకపోవడంతో చాలామంది ఇటీవల తెలంగాణలోని భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెంకు వలస వెళ్తున్నారు. అక్కడ తాపీ పనులతోపాటు హోటళ్లు, షాపుల్లో రోజు వారి పనులకు వెళ్లి వస్తున్నారు. గ్రామాల్లో పనులు లేకపోవడంతో ఈ దుస్థితి వచ్చింది.

8 వారాల వేతనాలు రావాలి



8 వారాల నుంచి పనులు చేస్తున్నా ఇప్పటి వరకు వేతనాలు జమ అవ్వలేదు. ఇంట్లో పూట గడవడం కష్టంగా మారుతోంది. వేసవిలో ఇంకా ఏం పనులు చేయడానికి లేవు. బకాయి వేతనాలు త్వరగా చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

చిచ్చడి భద్రయ్య, ఉపాధిహామీ శ్రామికుడు, కృష్ణవరం గ్రామం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



ఇప్పటి వరకు వేతనాల సొమ్ములు జమ కాలేదు. ఒక్కో కుటుంబానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతన బకాయిలు రావాల్సి ఉంది. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

నూప బుల్లెమ్మ, ఉపాధిహామీ శ్రామికురాలు, విస్సాపురం గ్రామం



ప్రపంచసుందరిని కలిసిన వేళ..

ప్రపంచసుందరి-2025గా ఎంపికైన సుచాత చువాంగ్‌శ్రీ సోమవారం రాజ్‌భవన్‌లో జరిగిన తేనీటి విందు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మర్యాదపూర్వకంగా కలుసుకున్న యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు డా.టి.దశరథరామారెడ్డి, డా.సంజోగ్‌మాథుర్ (యూఎస్‌ఏ)

నగలు, నగదుతో పరారైన వ్యక్తి అరెస్టు


217 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

అమలాపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నమ్మకంగా వ్యాపారి వద్ద పనిచేస్తూ బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని జీకే రెస్టారెంట్ యజమాని గుంగమళ్ల కాసుబాబు వద్ద గత ఐదేళ్లుగా అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన కంతేటి రాజా పనిచేస్తున్నాడు. గత నెల 26న ముమ్మిడివరంలోని బ్యాంకులో తాకట్టులో ఉన్న నగదును విడిపించుకుని రావాలని రాజాకు నగదు ఇచ్చి పంపించాడు. 322 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.25లక్షల నగదుతో రాజా పరారు కావడంతో యజమాని కాసుబాబు 27వ తేదీన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం సావరం రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న కంతేటి రాజాను అరెస్టుచేసి అతడి వద్ద నుంచి రూ.6.53లక్షల విలువైన 217 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. రాజాను కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించినట్టు సీఐ వీరబాబు పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 24 మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 24 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరిచారు. ఒకరికి 7 రోజులు, మరో 8 మందికి 2రోజులు చొప్పున జైలు శిక్ష, 15 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలుచొప్పున జరిమానా విధించినట్టు సీఐలు చెప్పారు.

మనస్తాపంతో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


ఈశ్వరరావు (ఫైల్)

తుని రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన అమలకంటి ఈశ్వరరావు (31) పిఠాపురం మాధవపట్నం రైల్వే గేటు వద్ద గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు కాకినాడ పోర్టులో ఔట్‌సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడని, అయితే అప్పు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి దురుసుగా ప్రవర్తించడంతో మనస్తాపానికి చెందిన ఈశ్వరరావు ఇంటి నుంచి రైల్వే గేటు వద్ద చేరుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

ఏసీబీ వలకు చిక్కారు

రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్ ట్రెజరీ అధికారి, సీనియర్ అసిస్టెంట్


ఏసీబీకి చిక్కిన వంశీ కళ్యాణ్, సామ్యూల్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ నాగేశ్వరరావు

చింతూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఉప ఖజానా కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సబ్ ట్రెజరీ అధికారి జీడీ.వంశీకళ్యాణ్, సీనియర్ అసిస్టెంట్ ఎన్‌వీఎంఎస్.సామ్యూల్ సోమవారం ఏసీబీ వలకు చిక్కారు. ఈ మేరకు విశాఖపట్నం రేంజ్ ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం నరసింహాపురం (బాలురు) ఆశ్రమ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎస్.పకీర్ దొర విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా పకీర్ దొరకు చెందిన పది సంవత్సరాల ఇంక్రిమెంట్లు ఏరియర్స్ బిల్లులు మొత్తం రూ.11,54,254 చెల్లింపు ప్రక్రియ ఆమోదించే క్రమంలో లంచంగా రూ.2 లక్షలు ఎస్టీవో (సబ్ ట్రెజరీ అధికారి) డిమాండ్ చేశాడు. ఈ మేరకు పకీర్ దొర ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారు రంగంలోకి దిగారు. ముందుగా రూ.1లక్ష అడ్వాన్సుగా చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా నేరుగా కార్యాలయంలోనే పకీర్ దొర నుంచి సబ్ ట్రెజరీ అధికారి సూచన మేరకు సీనియర్ అసిస్టెంట్ రూ.1లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు. కేసు నమోదు చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. దాడిలో ఏసీబీ ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావు, శ్రీనివాసరావు, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

5 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్



గంజాయితో పట్టుబడిన వ్యక్తి

తుని రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 5 కిలోల గంజాయితో కాకినాడ జిల్లా తుని నర్సీపట్నం బస్టాండ్ సమీపంలో తమిళనాడుకు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని సీఐ గీతా రామకృష్ణ వెల్లడించారు. తమిళనాడుకు చెందిన పాండ్య అనే వ్యక్తి నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తుండగా సోమవారం అరెస్ట్ చేసి అతడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్టు చెప్పారు.

2750 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

అమలాపురం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సోమవారం తెల్లవారుజామున తాలూకా పోలీసులకు అందిన సమాచారంతో ఎస్ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తమై రేషన్ బియ్యాన్ని వాహనంతో సహా స్వాధీనం చేసుకున్నారు. కోనసీమ జిల్లా బండారులంకలోని రెండు చౌకధరల దుకాణాల నుంచి నడిపూడికి చెందిన ఎ.సత్యనారాయణ 2750 కిలోల రేషన్ బియ్యాన్ని 55 మూటలుగా ప్రత్యేక వాహనంలో వేసుకుని తరలిస్తుండగా గ్రామ శివారున ఎస్ఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణతో పాటు చౌకడిపో డీలర్లు ఎస్.మాణిక్యాలరావు, కె.సుబ్రహ్మణ్యంలపై కేసు నమోదు చేశామని తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం మూటలు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

రూ.1,10,000 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్న చింతూరు పోలీసులు


పట్టుబడిన నిందితులతో చింతూరు పోలీసులు

చింతూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. చింతూరు ఎస్ఐ పి.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన చింతల దురాప్రసాద్, పిల్లి లీలాకృష్ణ ఒడిస్సాలోకి మల్కనగిరిలో 22 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. వయా చింతూరు మీదుగా ద్విచక్రవాహనం ద్వారా గంజాయి తరలించే యత్నం చేశారు. కాగా సోమవారం చేపట్టిన వాహన తనఖీల్లో భాగంగా గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. కాగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు వారు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,10,000 వరకు ఉంటుందని చెప్పారు.

ఆలయ కోనేరులో స్నానానికి దిగి

తండ్రి కొడుకుల మృతి


మృతదేహాలను పరిశీలిస్తున్న జగ్గంపేట సీఐ శ్రీనివాస్

కాకినాడ జిల్లా తాళ్లూరులో ఘటన

గండేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆలయ కోనేరులో స్నానానికి దిగి తండ్రి కొడుకులు మృతిచెందారు. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో జియ్యన్నమఠంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో సోమవారం మండలంలో బొర్రంపాలెం గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు సాగినల్ల బాబు(49), సాయి సంజయ్ శ్రీరామ్(19) స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతిచెందారు. తొండంగి మండలం వలసపాకలు చెందిన తమ బంధువులు మృతి చెందడంతో పరామర్శ కెళ్లి తిరిగి వస్తూ సాయంత్రం కోనేరులో స్నానానికి దిగగా ఈ ఘటన జరిగింది. వారిని గుర్తించిన స్థానికులు రక్షించే ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జగ్గంపేట సీఐ వైఆర్ కె.శ్రీనివాస్, గండేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే తండ్రి కొడుకులు మృతి వార్త తెలియడంతో బొర్రంపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయామని కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. సాయి సంజయ్ శ్రీరామ్ వైజాగ్‌లో బీటెక్ చదువుకుంటున్నాడని తెలిసింది.

పరీక్షల్లో ఫెయిలయ్యా.. ఒంటరితనం ఫీలవుతున్నా..

ఉరేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

సూసైడ్ నోట్ స్వాధీనం

రాజానగరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని సోమవారం కళాశాల వసతి గృహంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లూరు జిల్లా నర్సాపురం మండలం గుడ్లూరు గ్రామానికి చెందిన పరుచూరి ప్రగతి (19) బీటెక్ చదువుతోంది. సెకండ్ సెమ్ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కావడంతో ఆదివారం విద్యార్థిని స్వగ్రామం నుంచి కళాశాల వసతి గృహానికి చేరుకుంది. మొదటి సెమ్‌లో 4 పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని, దీంతో మానసికంగా ఆందోళనకు లోనవుతూ, ఒంటరితనం ఫీలవుతున్నానని, తల్లిదండ్రులను జాగ్రత్తగా ఉండమని రాసి ఉన్న సూసైడ్ నోట్‌ను సంఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నామని సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. పక్కగదిలో ఉంటున్న స్నేహితులు తరగతులకు వెళ్లగా ప్రగతి.. బయటకు కనిపించకుండా దుప్పటి అడ్డుగా ఏర్పాటు చేసుకుని దుస్తులు ఆరబెట్టుకునే హుక్కుకు చున్నీని బిగించుకుని ఉరేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించామని, కేసు నమోదు చేశామని వారు పేర్కొన్నారు.

ఆర్ఎంసీకి చిరంజీవినీకుమారి భౌతిక కాయం

ఊరేగింపుగా తీసుకెళ్లి అప్పగింత

ప్రముఖుల సంతాపం


చిరంజీవినీకుమారి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, మాజీ మంత్రి వేణు

కాకినాడ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, విద్యావేత్త డాక్టర్ పి.చిరంజీవినీకుమారి భౌతికకాయాన్ని సోమవారం పలువురు ప్రముఖులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢమైన సానుభూతి తెలిపారు. కాకినాడ ప్రతాప్‌నగర్‌లోని ఆమె నివాసం నుంచి పూర్వ విద్యార్థులు, అభిమానులు, ప్రజాప్రతినిధుల సందర్శనార్థం కాకినాడ సామర్లకోట రోడ్డులోని ఇంద్రపాలెం లాకుల వద్ద గల ఐడియల్ కళాశాలకు ఉదయం 11గంటలకు తీసుకురాగా పలువురు ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు ఆమె భౌతికకాయానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం చిరంజీవినీకుమారి కోరిక మేరకు వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం కాకినాడ రంగరాయ వైద్యకళాశాలకు ఊరేగింపుగా కళాశాల నుంచి తీసుకువెళ్లి అప్పగించారు. ఆమె మృతికి సంతాపం తెలిపినవారిలో ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కటకంశెట్టి బాబీ, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీలు వంగా గీత, మిడియం బాబూరావు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జేఎన్టీయూకే మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, మాజీ రిజిస్ట్రార్ వి.రవీంద్ర, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పి.కృష్ణారావు, కేఎస్‌పీఎల్ సీవోవో ఎం.మురళీధర్, దామెర మురళి, కుడా మాజీ చైర్మన్ చంద్రకళాదీప్తి, జడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, డాక్టర్ స్టాలిన్, ఆలపాటి శ్రీనివాస్, వక్కలంక రామకృష్ణ, డాక్టర్ ఎన్ఎస్‌మూర్తి, రంజిత్, సత్యనారాయణ, కృష్ణంరాజు, వర్మ, సుబ్బారావు కళాశాల పూర్వ విద్యార్థులు, పూర్వ, ప్రస్తుత అధ్యాపకులు, సాహిత్యాభిమానులు ఉన్నారు.



సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా ప్రధానాలయంలో మూలవరులకు సోమవారం వేకువఝామున పంచామృతాభిషేకాలు, ప్రత్యేకపూజలు ఘనంగా జరిగాయి. 2గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింప చేశారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాల అనంతరం పంచామృతాలతో అభిషేకించి నూతన పట్టువస్త్రాలను ధరింపచేశారు. 9గంటలకు యాగశాలలో ఆయుష్యహోమానికి పండితులు గణపతిపూజతో శ్రీకారం చుట్టారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు.


ఆయుష్యహోమం నిర్వహిస్తున్న పండితులు

అరుణాచలేశ్వరుడికి మామిడి రసాభిషేకం

ప్రత్తిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద అపీత కుంచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అరుణాచలేశ్వరుడికి 1313 మామిడి పండ్లరసంతో అభిషేకం నిర్వహించారు. తొలుత రుద్రాభిషేకం, పాలాభిషేకం కూడా నిర్వహించారు.



రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రహదారి చెంతనే గొయ్యి

ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివాన్‌చెరువు గ్రామస్థులు, ప్రయాణికులు



దివాన్‌చెరువు-పాలచర్ల రహదారి చెంతన ఏర్పడ్డ గొయ్యి

దివాన్‌చెరువు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు- పాలచర్ల రహదారిలో దివాన్‌చెరువు సచివాలయం సమీపంలో రహదారి పక్కన ఏర్పడ్డ గొయ్యి కారణంగా పలువురు ఇబ్బందులు పడుతున్నారు. రాజమహేంద్రవరం నుంచి పాలచర్ల వైపు వెళ్లే వారిలో కొంత మంది ద్విచక్రవాహనదారులతోబాటు, ఇతర వాహనాల వారు సచివాలయం ఎదుట నుంచి పాలచర్ల రోడ్డు కు మలుపు తిరుగుతారు. సరిగ్గా అక్కడే ఈగొయ్యి ఉండడంతో ఒకేసారి ఎదురెదురుగా వాహనాలు వచ్చే సందర్భంలో పాలచర్ల వైపు వెళ్లే వాహనాలకు రోడ్డు దిగేందుకు వీలుకాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఈగోతిలో నీరు నిలిచిపోతోంది. దీంతో ఏదైనా వాహనం ఆ గోతిలో పడితే అటుగా వెళ్లే పాదచారులపై బురదనీరు పడి అసౌకర్యానికి గురవుతున్నామని, సంబంధిత అధికార్లు జోక్యం చేసుకుని ఈ గోతిని పూడ్చించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎస్‌ఐ మనోహర్‌కు ఘన వీడ్కోలు



ఎస్‌ఐ మనోహర్‌ను సత్కరిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, సీఐలు

రాజానగరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ గోపాలపురం స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ మనోహర్‌కు వీడ్కోలు సభను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసే ఉద్యోగులు ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపుతో అందరి మన్ననలు చూరగొంటారన్నారు. కార్యక్రమంలో రాజానగరం, కోరుకొండ సీఐలు ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్, సత్యకిషోర్, ఎస్‌ఐలు నాగార్జున, నారాయణమ్మ, ప్రియకుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొని ఎస్‌ఐ మనోహర్‌ను దుశ్శాలుతో ఘనంగా సత్కరించారు.

తెనాలి ఘటనలపై ఎస్పీని సస్పెండ్ చేయాలి

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2(ఆంధ్ర జ్యోతి): తెనాలిలో రెండ్రోజుల వ్యవధిలో జరిగిన రెండు సంఘటనలకు పోలీసులే బాధ్యులని తక్షణమే ఆ జిల్లా ఎస్పీని సస్పెండ్ చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దారుణంగా ప్రవర్తిస్తున్నారన్నారు. తెనాలిలో ఇద్దరు యువకులను దారుణంగా కొట్టి వేధించడానికి కారకులైన ఎస్పీ, ఇద్దరు సీఐలపై చర్యలు తీసుకోవాలన్నారు. యువకులతో పోలీసులే గంజాయి వ్యాపారం చేయిస్తున్నారని, వారిపై పెట్టే కేసులు, వేధింపులు భరించలేక వ్యాపారం చేయలేమని చెప్పడంతో నడిరోడ్డుపై కొట్టుకుంటూ తీసుకెళ్లారని ఆరోపించారు.పిఠాపురంలో దళితులను గ్రా మ బహిష్కరణ చేస్తే డిప్యూటీ సీఎం పవన్‌క ళ్యాణ్ ఏమీ మాట్లాడలేదే అని ప్రశ్నించారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేయాలి

ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్

కడియం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకోవాలని, వాటి నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణపై అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రమేష్, ఐసీడీఎస్ రాజానగరం ప్రాజెక్టు ఏసీడీపీవో టి.కనకవల్లి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి క్రాంతిలాల్, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ బి.రాజ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాలను నియంత్రించి, బాల్యవివాహాల రహిత మండలంగా తయారు చేయాలని సూచించారు. బాల్యవివాహాలకు సహకరించిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యశ్రీ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, క్రాఫ్ కమ్యూనిటీసోషల్ వర్కర్ ప్రియాంక పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన పెంచాలి



టీబీ ముక్తి అభియాన్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి

కడియం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి తీవ్రత ప్రస్తుతం తగ్గుముఖం పట్టిందని, ఇది నూరుశాతం తగ్గాలంటే ప్రజలకు ఈ వ్యాధిపై మరింత అవగాహన పెంచాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ సూచించారు. సోమవారం కడియం, కడియపులంక పీహెచ్‌సీల పరిధిలో జరిగిన టీబీ ముక్తి అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రిలో సేవలు ప్రైవేటు ఆస్పత్రిలో కంటే మెరుగ్గా ఉండాల న్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, డాక్టర్లు మణిజ్యోత్స్న, నాగసాయిమౌర్య, టీబీ సూపర్‌వైజర్ శేషగిరిరావు, వైద్యసిబ్బంది విల్సన్‌పాల్, మూర్తి, సత్యనారాయణ, శాంతిప్రియ, సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో షిర్డిసాయి విజయభేరి





రాజమహేంద్రవరం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీషిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐ సాయి హిమ్నీష్ జాతీయస్థాయిలో 18వ ర్యాంకు, సీహెచ్ మోక్షిత్ 594వ ర్యాంకు, మోహన్ శ్రీరామ్‌జీ 685వ ర్యాంకు, మోహిత్ సత్యరాజ్ కిరణ్ 695వ ర్యాంకు కైవసం చేసుకున్నారన్నారు. 1000 లోపు నలుగురు, 3000లోపు 12 మంది, 5000లోపు 25 మంది, 10,000 32 మంది ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అందుకు కృషిచేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యా డీన్ చంద్రశేఖర్ అభినందించారు.

మధ్యాహ్న భోజనంలో జాగ్రత్తలు పాటించాలి

ఎంఈవో సత్తిరెడ్డి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో సత్తిరెడ్డి

అనపర్తి జూన్ 2 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది జాగ్రత్తలు పాటిస్తూ విద్యార్థులకు భోజనాలు అందించాలని ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి సూచించారు. సోమవారం అనపర్తిలోని జడ్పీ పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కుక్ కమ్ హెల్పర్లకు ఒక్క రోజు శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే సమయం ఆసన్నమౌతున్నందున పాఠశాల తెరిచే ముందు రోజునే పాత్రలను, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మండల పరిధిలోని 42 పాఠశాలల నుంచి 92మంది సిబ్బంది శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, రిసోర్స్‌పర్సన్ సురేంద్రకుమారి, స్టేట్ రిసోర్స్‌పర్సన్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

సీతానగరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సీతానగరంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో శ్రీ రామకృష్ణ పరమహంస మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 219 మంది రోగులు వైద్య సేవలు అందుకున్నారు. డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ వైద్యసేవలు అందించారు. కంటి ఆసుపత్రి తరపున 62 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 9 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి ఉచిత ఆపరేషన్‌ల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి సుశీల మన్నమని వెంకటనారాయణ, చంటిబాబు, కర్లపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో చాగల్నాడు

- కుచించుకుపోతున్న కాలువ
- కానరాని పూడికతీత పనులు
- పట్టించుకోని అధికారులు



ఫరిజల్లిపేట సమీపంలో కాలుష్య కాసారంగా దర్శనమిస్తున్న చాగల్నాడు కాలువ

రాజానగరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన చాగల్నాడు ప్రాంతాన్ని సస్య శ్యామలం చేసేందుకు టీడీపీ హయాంలో రూపుదిద్దుకున్న చాగల్నాడు కాలువ నేడు కాలుష్యం కోరల్లో చిక్కుకుని కంపుకొడుతోంది. ఎక్కడికక్కడే కాలువ కుచించుకుపోవడం ఒక వంతు అయితే మరో వైపు కాలువ గట్లు మాయమై సహజ స్వరూపాన్ని కోల్పోయి బలహీనంగా దర్శనమిస్తున్నాయి. కాలువ తవ్విన సమయంలో వచ్చిన మట్టి కాలువ గట్లు వెంబడి కొండలను తలపించిన మట్టి గుట్టలను సైతం కొంత మంది అక్రమార్కులు మాయం చేసేశారు. రాత్రి పగలు తేడా లేకుండా భారీ వాహనాలతో మట్టి తరలించుకుపోవడంతో గట్లు పూర్తిగా బలహీనంగా మారాయి. కాలువ వెంబడి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు నేరుగా కాలువలో కలుస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది.



పూడిక తీయకపోవడంతో మొక్కలతో నిండిపోయిన కాలువ

దీంతో చాగల్నాడు కాలువ ఆశయం, మెట్టప్రాంత ప్రజల ఆశలు కలగానే మిగిలాయి. చాగల్నాడు కాలువను ఇటీవల కాలంలో కొంతమంది అక్రమార్కులు అడ్డాగా మార్చుకుని ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తుండగా, మరో వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాలువ ఇరువైపుల గట్టను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుని వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నప్పటికి సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యమేంటో ఎవరికీ అంతుపట్టని పరిస్థితి. పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు కాలువలో కలుస్తుండటంతో కాలువలో మురుగునీరు పచ్చని తివాసీ పర్చినట్లుగా మారి కనీసం పశువులు తాగేందుకు కూడా పనికిరాకుండా పోతోంది. కాలువ ద్వారా గోదావరి జలాలు విడుదల చేసిన సమయంలో మురునీరంతా చెరువుల్లోకి, పంట పొలాల్లోకి చేరి లేనిపోని రోగాలు పుట్టుకొచ్చే ప్రమాదం పొంచి ఉంటుందని, ఆయకట్టు రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధించి అధికారులు స్పందించి కాలువలో పూడికతీత పనులు చేపట్టి, స్వచ్ఛమైన గోదావరి జలాలను అందించి, చాగల్నాడు కాలువను కాలుష్యం బారినుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

తరల్‌తో అభ్యసన సామర్థ్యాల పెంపు

- సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి
- ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఏపీసీ సుభాషిణి

రాజానగరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు తరల్ శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో దోహదపడుతుందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి పేర్కొన్నారు. రాజానగరం మండలం తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మండల స్థాయి రిసోర్స్‌పర్సన్లకు టీచ్ ఎట్ ద రైట్ లెవెల్(తరల్) ఎస్‌సీఈఆర్‌టీ అంశాలపై మూడు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణను అందజేస్తున్నామన్నారు. ఈ విద్యాసంవత్సరంలో అకాడమిక్ అంశాలపై ప్రత్యేక మోనిటరింగ్, మారుతున్న బోధనావసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నూతన బోధనా విధానాలను అనుసరించాలన్నారు.

నూతన విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో అమలు జరిగే అభ్యసన ప్రక్రియలు, ఎస్‌సీఈఆర్‌టీ అంశాలపై మోనిటరింగ్ ఉంటుందన్నారు. ఈ శిక్షణలో మండల స్థాయి రిసోర్స్ పర్సన్‌లకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ గ్రూపు శిక్షణ ఇస్తుందని, అనంతరం మండల స్థాయి రిసోర్స్‌పర్సన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ రాష్ట్ర పరిశీలకుడు అమ్మి నాయుడు, సమగ్ర శిక్ష జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ డి.గౌరీ శంకర రావు, తరల్ జిల్లా కోఆర్డినేటర్ సురేష్ నాని, 13 మంది స్టేట్ రిసోర్స్ గ్రూపు సభ్యులు, 110 మంది మండల రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



వృద్ధులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల ద్వారా ఇచ్చే నిత్యావసరాలను వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే అందించే ఏర్పాట్లు ప్రభుత్వం చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరంలోని 11వ డివిజన్‌లో అడబాల రాజా రేషన్ దుకాణాన్ని ఆర్డీవో కృష్ణనాయక్, తహశీల్దార్ పాపారావు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు.అనంతరం వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ పేరుతో వైసీపీ నాయకులు రైస్ మాఫియాకు తెరలేపారని దా నికి అడ్డుకట్ట వేస్తూ ప్రజల కోరిక మేరకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ను పునరుద్ధరించి ప్రతి నెలా 1నుంచి 15వ తేదీ వరకు సరుకులు పం పిణీ చేయిస్తున్నట్టు పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి నెలా 5వ తేదీలోపు రేషన్ వారి వద్దకే చేరుస్తారని చెప్పారు. అనంతరం లాలాచెరువు షాపు నెం.6 9, 46వ వార్డు రామదాసుపేటలోని షాపునెం 62, 36వ వార్డులో షాపు నెం.24, అంబేద్కర్‌నగర్‌లో షాపు నెం.90లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మజ్జి రాంబాబు, కురగంటి సతీష్, జామి సత్యనారాయణ, కంటిపూడి రాజేంద్రప్రసాద్, రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ రామారావు, జిల్లా అధ్యక్షుడు జామి కృష్ణ, బత్తిన నారాయణరావు, నమ్మి వెంకటేశ్వరరావు, కె.రమేష్, కె.ఆదిరాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం : బత్తుల

కోరుకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగాయని, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగించిందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సోమవారం కోరుకొండలో 33వ రేషన్‌షాపును ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మూసివేసిన రేషన్‌షాపులను పునఃప్రారంభిస్తున్నామన్నారు. గత పాలకులు ఇంటింటికీ రేషన్ అందిస్తామని రూ.1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేసి సక్రమంగా రేషన్ పంపిణీ చేయలేదన్నారు. వాహనాలకు సంబంధించి రూ.300 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి.భాగ్యవతి, తహశీల్దార్ సుస్వాగతం, ఎంఎస్‌వో ఎం.నాగాంజలి, సునీత, జనసేన నాయకులు ముక్కా రాంబాబు, బది రెడ్డి దొర, అడపా శ్రీనివాస్, మాతా సీతారాముడు పాల్గొన్నారు.



కోరుకొండలో రేషన్‌షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

వర్మీ కంపోస్టులో పోషక విలువలు అధికం

పంటలకు ఉపయోగిస్తే అధిక దిగుబడి
జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 2(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పంట దిగుబడుల కోసం పోషక విలువలు అధికంగా గల వర్మీ కంపోస్టును ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. మండలంలోని వెంకటనగరం పంచాయతీలో తయారు చేసిన వర్మీ కంపోస్టు అమ్మకపు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ సేంద్రీయ ఎరువులు కన్నా వర్మీ కంపోస్టులో పోషకాలు రెండితల అధికంగా ఉంటాయన్నారు. వాటిని ఉపయోగించడం తద్వారా భూసారం పెరగడమే కాకుండా పంటల నాణ్యత మెరుగుపడుతుందని తెలిపారు. వర్మీ కంపోస్టు వల్ల పండ్లు కూరగాయల నిల్వ సామర్థ్యం పెరుగుతుందని అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న 262 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. గృహాల నుంచి సేకరించిన తడి చెత్తను మూడు నెలల పాటు నాడెప్ తొట్టెలో పులియ బెట్టి దానిని 45 రోజుల పాటు వానపాములు గల కంపోస్టు తొట్టెలో వంచితే వర్మీ కంపోస్టు తయారవుతుందన్నారు. తయారైన వర్మీ కంపోస్టును కిలో ఒక్కంటికి రూ.10 చొప్పున విక్రయిస్తున్నట్టు తెలిపారు. వర్మీ కంపోస్టు ఎరువు కావలిసిన వారు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి కొనుక్కోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో చక్కని ఆరోగ్యం

కొవ్వూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేయడం వల్ల చక్కని ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలోని సంస్కృత కళాశాలలో సోమవారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకులు పెనుమత్స సత్యనారాయణరాజు, సరోజినీ సదస్సులో పాల్గొన్న వారికి యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ యోగాపై అవగాహన కలిగిన వారందరూ యోగాంధ్ర యాప్‌లో రిజిస్టర్ కావాలన్నారు. అవకాశం ఉన్నవారు ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎంఈవో రామకిషోర్, ఉపాధ్యాయ సిబ్బంది, వార్డు సెక్రటరీలు, హెల్త్ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: యోగా మనిషి జీవన ప్రమాణాలు పెంచి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపయోగపడుతుందని ఎంపీడీవో టీబీ వెంకటరమణ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో యోగాపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యోగా ఏ మతానికో, ప్రాంతానికో చెందిన ప్రక్రియ కాదన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల పీడీలు, స్థానికులతో యోగా ట్రైనర్లు మారిశెట్టి ప్రసన్న కుమారి పలు ఆసనాలు వేయించారు.

సాధు అమ్మవారికి పూజలు

ఉండ్రాజవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చివటం గ్రామంలో సాధు అమ్మవారి 44వ పుణ్య ఆరాధన ఉత్సవాలు సోమవారం ముగిసాయి. శనివారం, ఆదివారం, అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. ముగింపు రోజు నగర సంకీర్తన, గీతాపారాయణం, సాధు సమ్మేళనం జరిపారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

టీటీడీ లెటర్లు పేరుతో వస్తున్న ఫేక్ కాల్స్‌తో జాగ్రత్త!

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం తిరుపతికి సంబంధించి ఇచ్చే సిఫార్సు లెటర్ల ఇప్పిస్తామని కొంతమంది నుంచి వచ్చే ఫేక్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు నగరంలో కొంతమందికి ఫోన్లు చేసి తాము ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గారి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాము మీకు టీటీడీ బ్రేక్ దర్శనం, సుపథం, రూమ్స్ కోసం లెటర్లు కావాలంటే చెప్పండి మేము ఇప్పిస్తామని అంటూ డబ్బులు తీసుకుంటున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఇటువంటి వాటిని నమ్మవద్దని చెప్పారు. ఇలా ఫోన్లు వస్తే ఆ నెంబర్లను నోట్ చేసుకుని తిలక్ రోడ్డులోని తన కార్యాలయం దృష్టికి తీసుకురావాలని కోరారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపండి

పీజీఆర్ఎస్‌లో కమిషనర్ కేతన్‌గార్గ్



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి స్వీకరించే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులను మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి 25 అర్జీలు స్వీకరించారు. వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి 10 అర్జీలు, రెవెన్యూవిభాగానికి 2, టౌన్ ప్లానింగ్‌కి సంబంధించి 4, పబ్లిక్ హెల్త్‌కి 7, సచివాలయానికి సంబంధించి 2 అర్జీలు వచ్చాయని కమిషనర్ తెలిపారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కలిసిన నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కేఎస్ జవహర్‌ను టీడీపీ, దళిత, ప్రజాసంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిసారు. సోమవారం విజయవాడలో కేఎస్ జవహర్ ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విజయవాడలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఎస్సీ సెల్ నాయకుడు పెనుముచ్చి సురేష్, ధారా యేసురత్నం, కోరుమిల్లి విజయశేఖర్, చాపల చిన్నరాజు, ముప్పిడి రాజు, ఎస్సీ ఉద్యోగుల సంఘం నాయకులు కోరుకొండ చిరంజీవి, బోయినపల్లి కరుణాకార్, కుంచే దానవాయిబాబు తదితరులు జవహర్‌ను కలిసి పూలమాలలతో అభినందనలు తెలిపారు.

పేదల మరింత చేరువగా నాణ్యమైన వైద్యం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు మరింత చేరువగా నాణ్యమైన వైద్యాన్ని అందించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని తన నివాసంలో ధవళేశ్వరానికి చెందిన కనకనాల కళ్యాణ చక్రవర్తికి రూ.6లక్షల 36వేల 570, కాతేరుకు చెందిన చిల్లి ఆశీష్‌కు రూ.5లక్షలు, సాటిలైట్ సిటీకి చెందిన కోనాటి లలితకు రూ.లక్ష57వేల799 చెక్కులను అందిం చారు. వైద్యఖర్చులు భారమైన ప్రతి పేదవానికి సీఎం సహాయ నిధి ఎంతగానో భరోసా ఇస్తోందని గోరంట్ల అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, వైస్ చైర్మన్ బోడపాటి గోపి, నున్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొదటి సెమిస్టర్ పాస్ కాలేదని..
బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య
4
రూ.లక్ష లంచం తీసుకుంటూ
ఏసీబీ చిక్కిన ఇద్దరు

రెప్పపాటులో.. ఘోరం!





మృతులు శివన్నారాయణ, దేవి లలిత,తీగిరెడ్డి శివ, వర్షిత, శాన్వి



పాల ట్యాంకర్ వెనుక దూసుకుపోయిన కారు

20 నిమిషాల్లో గమ్యం.. అంతలోనే విషాదం

- వడిశలేరు వద్ద లారీని ఢీకొన్న కారు
- రెండు కుటుంబాలు ఛిద్రం
- ఐదుగురు మృతి..ఇద్దరికి గాయాలు
- కాకినాడ వెళ్లివస్తుండగా ఘటన
- మృతులది రఘునాథపురం,పిడింగొయ్యి

రాజమహేంద్రవరం/రంగంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):సాయంత్రం వరకూ కాకినాడ బీచ్‌లో సరదాగా గడిపారు.. ఆ కబుర్లు చెప్పుకుంటూ ఎంతో ఆనందంగా ఇంటికి బయలు దేరారు..మరో 20 నిమిషాల్లో ఇంటికి వెళ్లిపోతారు..రెప్పపాటులో ఘోరం జరిగిపోయింది.. అతివేగం తీరని విషాదం నింపింది. బావా బావమరుదుల కుటుంబంలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు.దీంతో తీవ్ర విషాదం నెలకొంది.రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన రేలంగి శివన్నారాయణ, రాజమండ్రి రూరల్ మం డలం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని కవలగొయ్యికు చెందిన తీగిరెడ్డి శివ బావా బామ్మర్దులు.ఎక్కడికెళ్లినా కలిసేవెళతారు.. ఇద్దరూ సరదాగా ఉంటారు. రేలంగి శివన్నారాయణకు కవల పిల్లలు వర్షిత, హర్షిత. వీరికి 13 సంవత్సరాలు. వీరి ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం కోసం గత కొద్దిరోజులుగా కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి వస్తున్నారు. దీనిలో భాగంగానే సోమవారం పీజీఆర్ఎస్ ఉండడంతో ఉదయం 9గంటల ప్రాంతంలో ఎస్‌యూవీ జైలో కారులో రేలంగి శివన్నారాయణ (40),ఆయన సతీమణి రేలంగి దేవి లలిత (34), వారి కవల పిల్లలు వర్షిత(13), హర్షిత (13), ఆయన బావమరిది తీగిరెడ్డి శివ(30) ,ఆయన సతీమణి తీగిరెడ్డి భవాని (26), కుమార్తె తీగిరెడ్డి సాన్వి(4) కలిసి సోమవారం కారులో కాకినాడ వెళ్లారు. కాకినాడలో పని చూసుకొని బీచ్‌కి వెళ్లి సరదాగా గడిపారు.భోజనం అనంతరం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తిరుగు పయనమయ్యారు. 20 నిమిషాల్లో ఇంటికి చేరిపోతారనగా రెండు కుటుంబాలు రెప్పపాటులో ఛిద్రమైపోయాయి. వీరిలో ఐదుగురు మృతిచెందగా హర్షిత, భవాని ఒక ప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కారును కిరాయికి తెచ్చి..

రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ తదితర వ్యాపారాలు చేస్తున్న శివన్నారాయణ ఓన్ డ్రైవింగ్ విధానంలో కారును స్నేహితుడి నుంచి ఎప్పటి మాదిరిగానే కిరాయికి తీసుకున్నాడు. కారును బావమరిది శివ నడుపుతున్నాడు. ఏడీబీ రోడ్డులోని వడిశలేరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రంగం పేటలోని ఓ డైయిరీ నుంచి పాల లోడుతో వస్తున్న ట్యాంకరు రోడ్డుపై నిలిపి ఉంది. అక్కడ రోడ్డు మరమ్మతులు చేస్తుండడంతో డైవర్షన్ బారికేడ్లు పెట్టారు. ఎడమవైపున లారీ ఆగి ఉంది. అక్కడికి వచ్చాక కారును కుడి వైపునకు మళ్లించాల్సి ఉంది. అయితే కారు వేగంగా వస్తుండడంతో మలుపు తిప్పే సమయంలో కుడి వైపునకు తిరగకుండా నేరుగా ఎదురుగా ఉన్న పాల ట్యాంకరులోకి దూసుకుపోయింది. దీంతో ముం దు సీట్లో కూర్చున్న శివన్నారాయణ, శివ, మధ్య సీట్లోని వర్షిత, లలిత, శాన్వి అక్కడికక్కడే మృతిచెందారు.వెనుక సింగిల్ సీట్లలో కూర్చున్న భవానీ, హర్షిత తీవ్రంగా గాయపడగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందున్నారు. ఏడీబీ రోడ్డులో సుమారు ఆరేళ్లుగా మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. దీంతో ఎక్కడపడితే అక్కడ బారికేడ్లు, డైవర్షన్లు ఉండడంతో అయోమయం ఏర్పడి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఆస్పత్రి వద్దకు మంత్రి కందుల దుర్గేష్ చేరుకొని బాధిత కుటుం బాలను ఓదార్చారు. రెండు కుటుంబాల్లో విషాదం కలచివేస్తోందన్నారు.మృతుల్లో కొందరికి జనసేన సభ్యత్వం ఉందని చెబుతున్నారని,ఆ మేరకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రయత్నిస్తామన్నారు.బాధితులను రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి పరామర్శించి ధైర్యం చెప్పారు.అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ,డీఎస్పీలు దివ్య, రమేష్ బాబు, సీఐ అప్పారావు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.పాలవ్యాన్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.ప్రమాదంపై రంగంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కవలలను విడదీసిన ప్రమాదం

శివన్నారాయణ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. అబ్బాయి ఇంటి దగ్గరే ఉండిపోవడంతో ప్రాణాలు దక్కాయి. ఇద్దరు కుమార్తెలు హర్షిత,వర్షిత కవలలు. పుట్టుక దగ్గర నుంచీ కలిసే ఉన్నారు. కలిసి చదువుకుంటున్నారు. ఇప్పు డు వర్షిత.. హర్షితను 13 ఏళ్లకే వదిలి వెళ్లిపోయిందం టూ బంధువులు రోదిస్తున్న తీరు కలచివేసింది.



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి దుర్గేష్



పాలవ్యాన్ లారీలో సగానికి దూసుకుపోయిన కారు



కారులో నొక్కుకుపోవడంతో ముగ్గురు సీట్లలోనే మృతి



రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో మృతుల కుటుంబీకులు రోదన

ప్రమాదానికి.. కారణమిదే..

వడిశలేరు సాయిబాబా గుడి వద్ద ఏడీబీ రోడ్డుపై కల్వర్టు నిర్మిస్తున్నారు. ఆ రోడ్డులో కార్లు రాకుండా పెట్రోలు బంక్ దగ్గర డైవర్షన్ పెట్టారు.అక్కడే ట్యాంకర్ ఆపి డ్రైవర్ మంచినీళ్ళు తెచ్చుకోవడానికి పెట్రోలు బంక్‌లోకి వెళ్లాడు. కారు అక్కడే కుడివైపునకు తిరిగి వెళ్లవలసి ఉండగా వేగంగా వచ్చిన కారు ట్యాంకర్‌ని బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.



28 ఇసుక ర్యాంపులు నిలిపివేత

అక్టోబరు 15 వరకూ బంద్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 28 ఇసుక ర్యాంపులు నిలిచిపోయాయి. జిల్లాలో 15 ఓపెన్ రీచ్‌లు, 10 సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు, 3 పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు ఆగినట్టు జిల్లా మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి సోమవారం ప్రకటించారు. జూన్ 1 నుంచే అమల్లోకి రాగా అక్టోబరు 15వ తేదీ వరకూ అమల్లో ఉంటుందని తెలిపారు. 18 డీసిల్టేషన్ పాయింట్లలో మాత్రం ఇసుక తవ్వకాలు జరుగుతాయి. జిల్లాలో 29 స్టాక్ పాయింట్లలో అధికారులు నిర్ణయించిన ధర ప్రకారం ఇసుక విధానాన్ని అమలు చేయనున్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఛైర్మన్(కలెక్టర్) నిర్ణయించిన ధరల మేరకు స్టాక్ పాయింట్ల వద్ద కాంట్రాక్టు ఏజెన్సీలు ఇసుక విక్రయాలు చేయాలనే నిబంధన పెట్టారు. జిల్లాలో ఆగిపోయిన ర్యాంపుల వివరాలు ఇలా ఉన్నాయి. కొవ్వూరు మండలం అరికిరేవుల, చిడిపి, తాళ్లపూడి మండలం ప్రక్కిలంక , నిడదవోలు మండలం పురుషోత్తపల్లి సెమీ మెకనైజ్డ్ రీచ్‌లను నిలిపివేశారు.సీతానగరం మండలం ములకల్లంక, మునికూడలి-1,2 పట్టాభూములు నిలిపివేశారు. మాన్యువల్‌రీచ్‌లు కొవ్వూరులోని చిడిపి, కుమారదేవంలో మూడు ర్యాంపులు,నిడదవోలులోని జీడిగుంట, పందలపర్రు,పెండ్యాల, పెరవలి మండలం కాకరపర్రు,తీపర్రు -2,3 సీతానగరం మండలం ములకల్లంక- కాటవరం,వంగలపూడి1,2, తాళ్లపూడిలోని వేగేశ్వరపురం, కడియంలోని వేమగిరి-కడియపులంక రీచ్‌లను అధికారులు నిలిపివేయాలని ఆదేశించారు. వర్షాకాలమైనప్పటికీ 18 డీసిల్టేషన్ ర్యాంపులలో ఇసుక తీతకు అనుమతిచ్చారు. కొవ్వూరు మండలం అరికిరేవుల-1,2, ఔరంగాబాద్ -1,2,దొండగుంట-1,2,కొవ్వూరు,ఎరినమ్మ, వాడపల్లి-1,2,రాజమండ్రి రూరల్ పరిధి ధవళేశ్వరంలో రెండురీచ్‌లు, కాతేరు, రాజమండ్రి సిటీ పరిధి కోటిలింగాల రీచ్,తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం, ప్రక్కిలంక-1, తాడిపూడి -1, మరొ కటి, తాళ్లపూడి-1 రీచ్‌లలో డీసిల్టేషన్ జరుగుతుంది.వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా 29 స్టాక్ పాయింట్లలో నిల్వలు చేస్తున్నారు.అక్కడే ఇసుక విక్ర యిస్తారు.



స్విఫ్ట్ కారు.. వెనుక సీటులో ఉన్న దూడలు

స్విఫ్ట్ కారులో దూడల తరలింపు

కొవ్వూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : గిత్త దూడలను అక్రమంగా స్విఫ్ట్ కారులో తరలిస్తుండగా ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు కొవ్వూరు పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఏజస్ ఆదివారం రాత్రి తుని వద్ద 4 గిత్త దూడలను కొనుగోలు చేసి స్విఫ్ట్ కారులో వెనుక సీటు తొలగించి అక్రమంగా హైదరాబాద్ తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది.సీఐ విశ్వం సిబ్బందితో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు గిత్త దూడలు తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కొవ్వూరు పోలీసులు సోమవారం ఏజస్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు.కారును సీజ్ చేసినట్టు తెలిపారు.గిత్త దూడలను సంరక్షణ నిమిత్తం దగ్గరలోని గోశాలకు తరలిస్తున్నట్టు తెలిపారు.

చివరిలో వచ్చారు.. వైస్ ఛైర్మన్ అయ్యారు..

- మంత్రి ఇలాఖాలో పాలిట్రిక్స్
- నిన్నటి వరకూ ఇద్దరి మధ్య పోటీ
- సోమవారం తెరపైకి కొత్తముఖం
- వైస్ ఛైర్మన్‌గా వజీరుద్దీన్
- రేసులో లేని రతీదేవి..కారింకి
- ఎన్నికకు వైసీపీ దూరం
- టీడీపీ కౌన్సిలర్ కారింకి డుమ్మా



వైస్‌ఛైర్మన్ వజీరుద్దీన్‌ని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్, ఛైర్మన్ ఆదినారాయణ తదితరులు

నిడదవోలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మునిసిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక సోమవారం అత్యంత నాటకీయ పరిణామాల మధ్య జనసేన కైవసం చేసుకుంది. మరో పక్క వైస్ ఛైర్మన్ ఎన్నికకు వైసీపీ కౌన్సిలర్లు పూర్తిగా దూరంగా ఉన్నారు. వీరికి తోడు టీడీపీ నుంచి గెలుపొందిన ఒకే ఒక్క కౌన్సిలర్ కూడా ఎన్నికకు దూరంగా ఉన్నారు. నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్ హాలులో సోమవారం మునిసిపల్ వైస్‌ఛైర్మన్ ఎన్నిక నిర్వహించారు. పరిశీలకుడిగా జేసీ ఎస్.చినరాముడు,ఎన్నికల అధికారిగా ఏ.దుర్గేష్ వ్యవహరించారు. నిడదవోలు పురపాలక సంఘానికి సంబంధించి 28 మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే, మంత్రి దుర్గేష్ ఎక్స్‌అఫీషియో నెంబర్‌గా నమోదై ఉండడంతో మొత్తం 29 మందికి ఓటు హక్కు ఉంది. ఇందులో వైసీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు ఎన్నికకు గైర్హాజరయ్యారు. టీడీపీకి చెందిన ఒకే ఒక్క కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు కూడా హాజరు కాలేదు. దీంతో 14 మంది జనసేన కౌన్సిలర్లు,ఎక్స్ అఫీషియోగా ఉన్న మంత్రి దుర్గేష్‌కు తోడుగా మరో వైసీపీ కౌన్సిలర్ షేక్ వజీరుద్దీన్ చివరి నిమిషంలో మంత్రి సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు. చివరి నిమిషంలో జనసేనలో చేరిన షేక్ వజీరుద్దీన్‌ను వైస్ ఛైర్మన్ అభ్యర్థిగా జనసేన కౌన్సిలర్ గంగుల వెంకటలక్ష్మి ప్రతిపాదించగా మరో జనసేన కౌన్సిలర్ మద్దిపాటి నాగశ్రీ బలపరిచారు. పోరం సరిపోవడంతో షేక్ వజీరుద్దీన్‌ను మునిసిపల్ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఏ.దుర్గేష్ ప్రకటించారు. వైస్ ఛైర్మన్ అభ్యర్థిగా సోమవారం ఉదయం వరకు జనసేన పార్టీకి చెందిన కౌన్సిలర్ పువ్వుల రతీదేవి, టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావుల మధ్య నువ్వా నేనా అన్నరీతిన పోటీ నెలకొంది. ఇరువర్గాల మధ్య విభేదాలు తలెత్తడంతో టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు ఎన్నికకు దూరంగా ఉన్నారు. అయితే చివరి నిమిషంలో వైసీపీ కౌన్సిలర్ వజీరుద్దీన్‌ను జనసేన పార్టీలోకి ఆహ్వానించి వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంత రం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో భవిష్యత్‌లో జరిగే ఏ ఎన్నికల్లో అయినా కూటమి విజయంలో జనసేన కీలక పాత్ర పోషిస్తుందన్నారు.జూన్ 4వ తేదీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి కానుకగా నిడదవోలు మునిసిపల్ విజయాన్ని అందిస్తున్నామన్నారు.

దండకుంటలో 2 ఇసుక డ్రెడ్జర్లు సీజ్

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో దింపిన 2 డ్రెడ్జర్లను సీజ్ చేసినట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశాల మేరకు సోమవారం కొవ్వూరులోని ఇసుక ర్యాంపులను టాస్క్‌ఫోర్సు అధికారులతో కలిసి ఆర్డీవో రాణిసుస్మిత తనిఖీ చేశారు.అరికిరేవుల రోడ్‌లోని దండకుంట ఇసుక ర్యాంపులో నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో దింపిన 2 డ్రెడ్జర్లు ఎవరివని ప్రశ్నించారు. మావి కాదని చెప్పడంతో వెంటనే డ్రెడ్జర్లను సీజ్ చేసి మైన్స్ అధికారులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు.ఆమె వెంట తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏజీ ఆర్‌బి ఏఈ జి.మణికంఠరాజు, టాస్క్‌ఫోర్సు అధికారులు ఉన్నారు.

దండకుంట ర్యాంపులో ఇసుక డ్రెడ్జర్లు సీజ్ చేసి వెళుతున్న ఆర్డీవో





ఆరోగ్యాంధ్ర

ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రతి రోజూ ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు.. జిల్లా అధికారులు హాజరై యోగాసనాలు వేస్తున్నారు.. సోమవారం జిల్లా వ్యవసాయాధికారి తదితరులు ఇలా యోగాసనాలు వేశారు.. ఆరోగ్యానికి యోగా మంచిదని అన్నారు..



ఏపపై కార్డు ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకుంటున్న దివ్యాంగురాలు

పీజీఆర్ఎస్‌కు 279 అర్జీలు

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలతో పాటు, మీ సేవ పోర్టల్ ,1100 టోల్‌ఫ్రీల ద్వారా వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి . ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు అనుసరించి పరిష్కారం చూపాలన్నారు. అనపర్తి మండలం పాలమూరు గ్రామానికి చెందిన నూకారపు సత్యవతి సామాజిక భద్రత పెన్షన్ కింద రూ.6 వేలు పెంపు, అంత్యోదయ కార్డుకు అర్జీపెట్టుకున్నారు.రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం, కడియం పంచాయతీలకు చెందిన జి.అనంతలక్ష్మి, వి.దేవి, సి.నాగమణి, ఐ.లక్ష్మి, చాపల త్రివేణి, షేక్ బేగం ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నారు. తాళ్ళపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన కె.అనిల్ కుమార్ గ్రామంలోని ప్రధానమార్గాల్లో ఆక్రమిత నిర్మాణాలు తొలగించాలన్నారు.పీజీఆర్ఎస్‌లో 279 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, ముఖ్యప్రణాళిక అధికారి జేడీఎల్.అప్పలకొండ,ఎస్డీసీలు ఎంఆర్ఆర్.ప్రేమ్ కుమార్, టి.భాగ్యలక్ష్మి, డీఎల్‌డీవోలు పి.వీణాదేవి, ఏస్వీవా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ళ స్థలాలకు సీపీఐ ధర్నా

పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కలెక్టర్ ప్రశాంతిని కలిసి ఇళ్ళ స్థలాలకు 1200 మంది సంతకాలతో కూడిన అర్జీలను అందించారు. అనంతరం మధు మాట్లాడుతూ అర్హులందరికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలన్నారు. దళితుల దారిని మూసివేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. రంగంపేట మండలం ఈలకొలను గ్రామపరిధిలోని అచ్యుతాపురం కొత్తపేట కాలనీ దళితులు సోమవారం ధర్నా చేశారు. కొత్తపేట కాలనీకి చెందిన వంద దళిత కుటుంబాలు మార్గంగా వినియోగించుకుంటున్న పుంత రోడ్డును సరిహద్దు రైతు మూసివేశారని..న్యాయం చేయాలని రాజబాబు, బాధిత దళితులు కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రవి కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, నగర కార్యవర్గ సభ్యులు పి.లావణ్య, టి.నాగేశ్వరరావు, పి.త్రిమూర్తులు , కడిలి సతీష్, శ్రీకాంత్, డొక్కులూరి సంగీత, రెడ్డి దుర్గాదేవి, మడికి సత్యం పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 25 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ(పరిపాలన), ఏవీ సుబ్బరాజు(శాంతి భద్రతలు) ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి సమస్యపై ఆరా తీశారు. చట్ట పరిధిలో తగు చర్యలు త్వరిత గతిన తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 25 అర్జీలు స్వీకరించారు.

5న మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో టీబీవీ రమణ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని 16 గ్రామ పంచాయతీల జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

జవహర్‌ను సత్కరించిన రుడా చైర్మన్ బొడ్డు



గామన్‌బ్రిడ్జి వద్ద జవహర్‌ను సత్కరిస్తున్న వెంకటరమణ చౌదరి

కొవ్వూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాజీమంత్రి కేఎస్ జవహర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొవ్వూరులోని ఆయన నివాసం నుంచి అభిమానులు,నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా విజయవాడ తరలివెళ్లారు. అనంతరం తుమ్మలపల్లి కళావేదికలో జవహర్‌ను టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు కలిసి సత్కరించారు. కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి జవహర్‌ను కలిసి శాలువాను కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

లిన్సీకి బంగారు పతకం



లిన్సీని అభినందిస్తున్న దుర్గారావు

దేవరపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించిన పెన్కాక్ సిలాట్ పోటీల్లో దేవరపల్లికి చెందిన కోణాల లిన్సీ బంగారు పతకాన్ని సాధించటంతో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, పలువురు అభినందించారు. ఈ సందర్భంగా లిన్సీ మాట్లాడుతూ ఈ విజయానికి తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులైన కోణాల సత్యనారాయణ, శైలజకు, పీఈటీ కృష్ణంరాజు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు రాజేశ్వరి, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో చక్కని ఆరోగ్యం : కమిషనర్



యోగాసనాలు వేస్తున్న మున్సిపల్, రెవెన్యూశాఖ అధికారులు, ఉద్యోగులు

కొవ్వూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేయడం వల్ల చక్కని ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలోని సంస్కృత కళాశాలలో సోమవారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకులు పెనుమత్స సత్యనారాయణ రాజు, సరోజినీ సదస్సులో పాల్గొన్న వారికి యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ యోగాపై అవగాహన కలిగిన వారందరూ యోగాంధ్ర యాప్‌లో రిజిస్టర్ కావాలన్నారు. అవకాశం ఉన్నవారు ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, ఎంఈవో రామకిషోర్, ఉపాధ్యాయ సిబ్బంది, వార్డు సెక్రటరీలు, హెల్త్ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: యోగా మనిషి జీవన ప్రమాణాలు పెంచి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపయోగపడుతుందని ఎంపీడీవో టీబీ వెంకటరమణ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో యోగాపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యోగా అనేది ఏ మతానికో, ప్రాంతానికో చెందిన ప్రక్రియ కాదన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల పీడీలు, స్థానిక ప్రజలతో యోగా ట్రైనర్లు మారిశెట్టి ప్రసన్న కుమారి పలు ఆసనాలు ఎలా వెయ్యాలో తెలిపారు. పీడీ జగదీష్ మనిషికి అవసరమయ్యే ఆసనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల పీడీలు టీ. రామచెల్లయ్య, జే. మోహనరావు, ఏ. విజయకుమార్, వెంకటేశ్వరరావు, శ్రీలక్ష్మి, పి.లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమణ, ఇన్‌చార్జి తహశీల్దార్ భారతి, తదితరులు

'పీజీఆర్ఎస్ ఫిర్యాదుల.. సత్వర పరిష్కారానికి చర్యలు'



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత తెలిపారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్డీవో మాట్లాడుతూ మొత్తం 10 ఫిర్యాదులు స్వీకరించామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి డివిజనల్ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా టోల్‌ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్, మండలస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత చిన్ని జన్మదిన వేడుకలు



చిన్నికి కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

కొవ్వూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని సూర్య భాస్కర రామ్మోహన్ (చిన్ని) జన్మదినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, నాయకుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అలాగే ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాసరావు, అర్జిల్లి రామకృష్ణ, నాళం శ్రీనివాసరావు, మద్దుల సత్యనారాయణ, పెనుమాక జయరాజు, కాగిత రఘు, గెల్లా సురేష్, మంకెన వీరన్న, కంటమణి రామకిషోర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని చిన్నికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

జల్లిసీమ యాత్ర స్పెషల్ ఆర్టీసీ సర్వీసు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ కుమార్

కొవ్వూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అరకు అందాలు చూసేందుకు ఈ నెల 14వ తేదీన స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసినట్టు కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ తెలిపారు. సోమవారం డిపో నుంచి జల్లిసీమ యాత్ర స్పెషల్ బస్సును ప్రారంభించారు.అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ ఈ యాత్రలో నత్తా రామేశ్వరం రామలింగేశ్వరస్వామి ఆలయం, గునుపూడి సోమేశ్వరస్వామి, యనమదుర్రు శక్తీశ్వరస్వామి, భీమవరం మావుళ్లమ్మ, బలుసుమూడి దత్త అష్టలక్ష్మీ ఆలయం, పెద అమిరం జైన్ మందిరం, కాళ్లకూరు భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల సందర్శ ఉంటుందన్నారు. ఉదయం ఐదు గంటలకు బస్సు కొవ్వూరు నుంచి బయలుదేరి అదేరోజు సాయంత్రం ఆరు గంటలకు కొవ్వూరు చేరుకుంటుందన్నారు. రెండురోజుల యాత్ర టికెట్ ధర రూ. 1900 మాత్రమేనన్నారు. లంబసింగి, పాడేరు, మొదమాంబ, చపరాయి వాటర్ ఫాల్స్, అరకు, బుర్రగుహలు, ఆర్‌కె బీచ్, తదితర ప్రదేశాలను సందర్శించి తిరిగి కొవ్వూరు తీసుకురావడం జరుగుతుందన్నారు. బస్సుకు సరిపడా యాత్రికులు ఉంటే ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు.

శరవేగంగా కొవ్వాడ కాల్వ పూడికతీత పనులు

● చాగల్లులో పనులు పరిశీలించిన ఎమ్మెల్యే ముప్పిడి



పనులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

చాగల్లు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ కాల్వ పూడికతీత పనులు సుమారు రూ. మూడు కోట్లతో శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కాల్వ పరీవాహక ప్రాంతంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించి మాట్లాడుతూ తొలిదశలో పూడికతీతకు రూ. 80 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే ప్రస్తుతం రెండోవిడతలో రూ. 2.19 లక్షలు మంజూరయ్యాయన్నారు. వర్షాకాలంలో ఈ కాలువకు వరదలు వస్తే వేలాది ఎకరాల్లో పంట నీటమునిగి రైతులు పంట నష్టపోతున్నారన్నారు. ఈ సమస్యను సీఎం, ఇరిగేషన్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ డీఈ సుజాత, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ అళ్ల హరిబాబు, టీడీపీ నాయకులు తాళ్లూరి ప్రసాద్, ఈడుపుగంటి మురళి, నందిగం శ్రీను, తాళ్లూరి శ్రీనివాసరావు, బొడ్డు కేశవకుమార్, ఈడుపుగంటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

చివటంలో ఘనంగా ముగిసిన ఆరాధనోత్సవాలు



పూజలు అందుకుంటున్న సాధు అమ్మవారు

ఉండ్రాజవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చివటంలో సాధు అమ్మవారికి గత మూడురోజులుగా నిర్వహిస్తున్న 44వ పుణ్యారాధనోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. శని, ఆదివారాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. ముగింపు రోజు నగర సంకీర్తన, గీతా పారాయణం, సాధు సమ్మేళనం జరిపారు. అనంతరం అఖండ అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

'వర్మీ కంపోస్టును ఉపయోగించాలి'

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పంట దిగుబడి, అధిక పోషక విలువల కోసం వర్మీ కంపోస్టును ఉపయో గించాలని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. రూరల్ మండలం వెంకటనగరం పంచాయతీలో తయారు చేసిన వర్మీకంపోస్టు అమ్మకపు కేంద్రాన్ని సోమవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ సేంద్రియ ఎరువులు కంటే, వర్మీకంపోస్టులో పోషకాలు రెండింతలు అధికంగా ఉంటాయన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ ఎస్.నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్లను తొలగించటం కోసం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని జగన్నాథపురం, కోమటిగుంట, కరిచర్లగూడెం, నందిగూడెం, బుచ్చెంపేట, రేగులకుంట, సంజీవపురం గ్రామాలు, పరిశ్రమలకు సరఫరా ఉండదన్నారు.

పెరవలి: మల్లేశ్వరం 33కేవీ/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నందు కడింపాడు అగ్రికల్చరల్ ఫీడర్‌కు ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు.

ఆ రోడ్డుపై భారీ వాహనాలు నడపరాదు

చాగల్లు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చాగల్లు నుంచి దేవరపల్లి మండలం లక్ష్మీపురం వరకు రూ. 7.80 లక్షలతో సుమారు పది కిలో మీటర్లు మేర రోడ్డు నిర్మాణం జరిగినట్టు పంచాయతీరాజ్ ప్రాజెక్టు డివిజనల్ ఇంజనీర్ పి. శ్రీనివాసరావు తెలిపారు. విపత్తుల నిర్వహణ నిధులతో నిర్మించిన ఈ రోడ్డుపై 10 టన్నుల బరువుకి తగ్గట్టుగా అనుమతి ఉందని చెప్పారు. అంతకుమించి భారీ వాహనాలను నిషేధించినట్టు తెలిపారు. అయితే సుమారు 40 టన్నుల బరువు గల క్వారీ లారీలు, స్థానిక ఫ్యాక్టరీకి సంబంధించిన వాహనాలు ప్రయాణిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. ఈ వాహనాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని చాగల్లు, దేవరపల్లి ఎంపీడీవోలకు, చాగల్లు, లక్ష్మీపురం పంచాయతీ కార్యదర్శులకు తగిన చర్యల కోసం ఆదేశాలు జారీ చేశారు. వాటి ప్రతిని స్థానిక విలేఖరులకు కాంట్రాక్టర్ మేడా వెంకట వరప్రసాద్ విడుదల చేశారు.

'ప్రతి గ్రామాన్ని టీబీ రహితంగా తీర్చిదిద్దాలి'



అజ్జరంలో ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రసాద్

పెరవలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అజ్జరంలో సోమవారం 100 రోజులు టీబీ ప్రచార కార్యక్రమాన్ని ఎంపీపీ కార్చెర్ల సీతారామ్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సం దర్భంగా స్థానిక ప్రాథమిక ఆరో గ్య కేంద్రం వైద్యుడు ఇ. తేజశ్రీ మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు, రాత్రిపూట జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో 150 మం దికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ రాజేష్, సీహెచ్‌వో శివ, 104 సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలకు చిక్కారు

రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్ ట్రెజరీ అధికారి, సీనియర్ అసిస్టెంట్

చింతూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి):చింతూరు ఉప ఖజానా కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సబ్ ట్రెజరీ అధికారి జీడీ.వంశీకల్యాణ్, సీనియర్ అసిస్టెంట్ ఎన్‌వీఎంఎస్.సామ్యూల్ సోమవారం ఏసీబీ వలకు చిక్కారు. ఈ మేరకు విశాఖపట్నం రేంజ్ ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు వెల్లడించారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం నరసింహాపురం (బాలురు) ఆశ్రమ పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గా ఎస్. పకీర్ దొర విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఈయనకు చెందిన పది సంవత్సరాల ఇంక్రిమెంట్లు, ఏరియర్స్ బిల్లులు మొత్తం రూ.11,54,254 చెల్లింపు ప్రక్రియ ఆమోదించే క్రమంలో లంచంగా రూ. రెండు లక్షలు ఎస్టీవో (సబ్ ట్రెజరీ అధికారి) డిమాండ్ చేశాడు. ఈ మేరకు పకీర్‌దొర ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారు రంగంలోకి దిగారు. ముందుగా రూ.లక్ష అడ్వాన్సుగా చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా నేరుగా కార్యాలయంలోనే పకీర్‌దొర నుంచి సబ్‌ట్రెజరీ అధికారి సూచన మేరకు సీనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు. కేసు నమోదు చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. దాడిలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, శ్రీనివాసరావు, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

ఆర్ఎంసీకి చిరంజీవినీకుమారి భౌతిక కాయం



చిరంజీవినీకుమారి భౌతిక దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, తదితరులు

● ఊరేగింపుగా తీసుకెళ్లి అప్పగింత
● ప్రముఖుల సంతాపం

కాకినాడ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, విద్యావేత్త డాక్టర్ పి.చిరంజీవినీకుమారి భౌతికకాయాన్ని సోమవారం పలువురు ప్రముఖులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢమైన సానుభూతి తెలిపారు. కాకినాడ ప్రతాప్‌నగర్‌లోని ఆమె నివాసం నుంచి పూర్వ విద్యార్థులు, అభిమానులు, ప్రజాప్రతినిధుల సందర్శనార్థం కాకినాడ సామర్లకోట రోడ్డులోని ఇంద్రపాలెం లాకుల వద్ద గల ఐడియల్ కళాశాలకు ఉదయం 11గంటలకు తీసుకురాగా పలువురు ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు ఆమె భౌతికకాయానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం చిరంజీవినీకుమారి కోరిక మేరకు వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం కాకినాడ రంగరాయ వైద్యకళాశాలకు ఊరేగింపుగా కళాశాల నుంచి తీసుకువెళ్లి అప్పగించారు. ఆమె మృతికి సంతాపం తెలిపినవారిలో ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కటకంశెట్టి బాబీ, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీలు వంగా గీత, మిడియం బాబూరావు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జేఎన్టీయూకే మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, మాజీ రిజిస్ట్రార్ వి.రవీంద్ర, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పి.కృష్ణారావు, కేఎస్‌పీఎల్ సీవోవో ఎం.మురళీధర్, దామెర మురళి, కుడా మాజీ చైర్మన్ చంద్రకళాదీప్తి, జడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, డాక్టర్ స్టాలిన్, ఆలపాటి శ్రీనివాస్, వక్కలంక రామకృష్ణ, డాక్టర్ ఎన్ఎస్‌మూర్తి, రంజిత్, సత్యనారాయణ, కృష్ణంరాజు, వర్మ, సుబ్బారావు కళాశాల పూర్వ విద్యార్థులు, పూ ర్వ, ప్రస్తుత అధ్యాపకులు, సాహిత్యాభిమానులు ఉన్నారు.

జగన్ తొలి ఏడాదిలో.. 10 హామీలు కూడా అమలు చేయలేదు

● వైసీపీ వెన్నుపోటు దినం నిర్వహణపై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కుంభకోణాల నుంచి ప్రజలను దృష్టి మళ్లించడానికే మాజీ సీఎం జగన్ ముఠా దర్నాలు, డ్రామాకు తెర లేపిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆరోపించారు. ఈనెల 4న వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే వెన్నుపోటు దినంపై ఆయన సోమవారం తీవ్రంగా పత్రికాముఖంగా ఖండించారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది 10 హామీలు కూడా అమలు చేయలేదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఐదేళ్లలో 85 శాతం హామీలకు ఎగనామం పెట్టాడని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 70 శాతం హామీలను అమలు చేసిందన్నారు. గతాన్ని మరచిన జగన్ మరోసారి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్నక్యాంటీన్లు ప్రారంభించి పేదలకు రూ. 5 కే కడుపు నిండా అన్నంపెట్టి వారి ఆకలిని తీర్చుతున్నామన్నారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి రూ. 27 వేలు విరాళం

దేవరపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధి నిమిత్తం జుట్టా సూరిబాబు, అంజమ్మ దంపతులు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావుకు రూ. 27 వేలు నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జుట్టా సూరిబాబు కుమారులు సీతారామయ్య, దుర్గా కృష్ణసాయి, తదితరులు పాల్గొన్నారు.

పసలపూడిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పసలపూడిలో సామాజిక సేవకుడు సీహెచ్ విజయ్ ఆధ్వర్యంలో తన స్నేహితుడు వేము శ్రీధర్ జ్ఞాపకార్థం సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 15 మంది పాల్గొని రక్తదానం చేశారు. తణుకు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు వారి సహకారంతో నిర్వహించారు. శ్రీధర్ స్నేహితులు ఎం.సువర్ణరాజు, ఎన్. సురేష్, టి. వెంకటరావు, వై. ఏడుకొండలు, వై. షాలేము, నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు.

పరీక్షల్లో ఫెయిలయ్యా.. ఒంటరితనం ఫీలవుతున్నా..

● ఉరేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య
● సూసైడ్ నోట్ స్వాధీనం

రాజానగరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశా లలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని సోమవారం కళాశాల వసతిగృహంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లూరు జిల్లా నర్సాపురం మండలం గుడ్లూ రు గ్రామానికి చెందిన పరుచూరి ప్రగతి (19) బీటెక్ చదువుతోంది. సెకండ్ సెమ్ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కావడంతో ఆదివారం విద్యార్థిని స్వగ్రామం నుంచి కళాశాల వసతి గృహానికి చేరుకుంది. మొదటి సెమ్‌లో నాలుగు పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని, దీంతో మానసికంగా ఆందోళనకు లోనవుతూ, ఒంటరితనం ఫీలవుతున్నా నని, తల్లిదండ్రు లను జాగ్రత్తగా ఉండమని రాసి ఉన్న సూసైడ్ నోట్‌ను సంఘటనా స్థలంలో స్వాధీ నం చేసుకున్నామని సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. పక్కగదిలో ఉంటున్న స్నేహితులు తరగతులకు వెళ్లగా ప్రగతి.. బయటకు కనిపించకుండా దుప్పటి అడ్డుగా ఏర్పాటు చేసుకుని దుస్తులు ఆరబెట్టుకునే హుక్కుకు చున్నీని బిగించుకుని ఉరేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించామని, కేసు నమోదు చేశామని వారు పేర్కొన్నారు.